


సోలార్ కార్యాలయాల్లో.. కాంతులు

సోలార్ పవర్.. సూర్యుడి వెలుగులను వృథా కానీయకుండా కరెంట్ ఉత్పత్తి. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారులపై బిల్లుల భారం తగ్గుతుంది. ఈ క్రమంలో సోలార్ పవర్ ద్వారా కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం కూడా సిద్ధమైంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు కూడా సోలార్ పవర్‌ను సద్వినియోగం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు సంబంధించి ఎన్‌టీపీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతను ఎన్‌టీపీసీకి అప్పగించింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 260 ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి సోలార్ కాంతులు ప్రసరించనున్నాయి. తద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.50 కోట్ల వరకు విద్యుత్ బిల్లుల భారం తగ్గనున్నది.



- నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలరైజేషన్
- నిర్వహణకు ఎన్‌టీపీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం
- ఏడాదికి లక్ష యూనిట్లు వచ్చే కార్యాలయాలకు ప్రాధాన్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 260 కార్యాలయాల్లో ప్యానల్స్ ఏర్పాటు
- ఏడాదికి సుమారు రూ.50 కోట్లకుపైగా తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం
- సోలరైజేషన్ వల్ల వాయు కాలుష్యం పూర్తిగా తగ్గుతుందంటున్న అధికారులు

- ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి గతంలో నెలకు రూ.30 లక్షల వరకు కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడు అది రూ.3 లక్షలకు పరిమితమైంది. కారణం ఏమిటంటే అక్కడ 2 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్స్ అమర్చారు.
- గుంటూరు నగరానికి తాగునీటిని అందించే సంగం జాగర్లమూడి పంపు హౌస్ వద్ద 500 కిలో వాట్ సామర్థ్యం కలిగిన ఫ్లోటింగ్ సోలార్ అమర్చారు. అప్పటి నుంచి విద్యుత్ బిల్లు తగింది.
- గుంటూరు కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి తదితర ప్రధాన కార్యాలయాలకు గతంలో రూ.వేలల్లో కరెంటు బిల్లులు వచ్చేవి. ఆయా కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ కార్యాలయాలకు గణనీయంగా విద్యుత్ బిల్లులు ఆదా అవుతున్నాయి.

పలు ప్రభుత్వ కార్యాలయాలకు నెలనెలా రూ.వేలల్లో కరెంటు బిల్లులు వచ్చేవి. వాటిని కట్టడం ఆయా కార్యాలయాలకు గగనంగా మారుతుంది.

- (గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

ఇప్పటికీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ట్రాన్స్‌కోకు ఉన్న పెండింగ్ బిల్లుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల వాటానే అధికం. కొన్ని సందర్భాల్లో కరెంటు బిల్లులు కట్టలేదని ట్రాన్స్‌కో అధికారులు ఆయా కార్యాలయాలకు విద్యుత్ ఫీజులు తీసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంపై దృష్టి సారించింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు ఆంధ్రప్రదేశ్ నూతన మరియు పునరుద్ధరణ ఇందన వనరుల అభివృద్ధి సంస్థ(నెడ్ క్యాప్) ఆధ్వర్యంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి సొమ్మును ఆదా చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ భవనాల సోలరైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వినియోగిస్తుంది. ఆయా కార్యాలయాలకు గణనీయంగా విద్యుత్ బిల్లులు తగ్గిపోయాయి.

ఎన్‌టీపీసీదే మొత్తం బాధ్యత

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త బిజిలీ యోజన కింద ప్రభుత్వ కార్యాలయాల సోలరైజేషన్‌కు శ్రీకారం చుడుతున్నది. ఈ క్రమంలో ఈ బాధ్యతను ప్రభుత్వం ఎన్‌టీపీసీకి అప్పగించింది. రెస్కో సిస్టంలో ఎన్‌టీపీసీ ఈ బాధ్యతను నిర్వర్తిస్తుంది. ఏడాదికి లక్ష యూనిట్లు విద్యుత్ వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యత 25 ఏళ్ల వరకు ఎన్‌టీపీసీ చూసుకుంటుంది. ప్యానల్స్ ఏర్పాటు మొత్తం ఖర్చును ఎన్‌టీపీసీ భరిస్తుంది. అందుకు ప్రతిగా ప్రభుత్వ శాఖల నుంచి అతితక్కువ విద్యుత్ చార్జీలను వసూలు చేస్తుంది. ఉదాహరణకు ప్రస్తుతం యూనిట్ చార్జి రూ.4 వరకు ఉంటే, సోలరైజేషన్ తర్వాత ఎన్‌టీపీసీ యూనిట్ చార్జి రూ.2 మాత్రమే తీసుకునేలా ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. సోలరైజేషన్‌కు మొదట ఏడాదికి లక్ష యూనిట్లు విద్యుత్ వాడుతున్న ప్రభుత్వ కార్యాలయాలను ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 260 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నట్లు నెడ్ క్యాప్ తేల్చింది. గుంటూరు సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఒక్కొక్క కార్యాలయం, స్థానిక సంస్థలకు నెలనెలా లక్షల్లో కరెంట్ బిల్లు వస్తుంది. సోలరైజేషన్ జరిగితే ఆ భారం చాలా వరకు తగ్గుతుంది. ప్రస్తుతం గుంటూరుకు తాగునీరు అందించే సంగంజాగర్లమూడి పంపు హౌస్‌కు ఫ్లోటింగ్ సోలార్(నీటిపై) ప్యానల్స్ ఏర్పాటు చేశారు. దానివల్ల ఆ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం బాగా తగ్గినట్లు తేలింది. సోలార్ పని తీరును తెలియజేసే యాప్‌లో 2023 డిసెంబరులో సంగంజాగర్లమూడి పంపు హౌస్‌కు ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటు చేయడం వల్ల ఇప్పటి వరకు 169.8 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉత్పత్తి తగ్గిందని, 169.8 టన్నుల బొగ్గు ఆదా అయినట్లు నిర్ధారణ అయ్యింది. ప్రభుత్వ కార్యాలయాల సోలరైజేషన్ వల్ల వాయు కాలుష్యం పూర్తిగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. బొగ్గు నిల్వలు పెరుగుతాయని, ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందంటున్నారు.

అద్భుతమైన పరిష్కారం



విద్యుత్ సమస్యను అధిగమించేందుకు సోలార్ విద్యుత్ అద్భుతమైన పరిష్కారం. సోలరైజేషన్ వల్ల ప్రభుత్వ సొమ్ము చాలా వరకు ఆదా అవుతుంది. గృహాలకు కూడా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78వేల వరకు ఒక్కొక్కరికి సబ్సిడీ ఇస్తుంది.

- ఉడుముల బ్రహ్మారెడ్డి, పీడీ, నెడ్ క్యాప్



రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం



- జీతం రూ.13200.. కటింగ్ రూ.9400
- హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాల్లో కోతలే కోతలు
- గగ్గోలు పెడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు
- నవంబరు నుంచి మిగిలిన సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ లింకు

హాజరు లింకు.. జీతం కోత

గుంటూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆ ఉద్యోగులకు పని కాదు.. హాజరు ముఖ్యం అంట. హాజరు ఆధారంగానే వారికి జీతం ఇస్తారంట. ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం) పేరుతో ఉద్యోగులకు భారీగా జీతాల్లో కోత పడుతుంది. దీంతో ఆయా ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నా అధికారులు ఆలకించడంలేదు. నేషనల్ హెల్త్ మిషన్‌లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు అక్టోబరు నెల జీతంలో భారీగా కోత పడింది. గుంటూరు జిల్లా పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటిజెంట్ వర్కర్‌గా పనిచేసే ప్రత్తిపాటి పద్మ జీతం రూ.13200 కాగా ఎఫ్ఆర్ఎస్ పేరుతో అక్టోబరు జీతంలో రూ.9400 కోత విధించారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 70 మంది రెండో ఏఎన్ఎంలకు నెలకు రూ.23 వేలు జీతం కాగా వారిలో ఎక్కువ మందికి రూ.6 వేలు చొప్పున కోత విధించారు. ఇక డాక్టర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు జీతాల్లో కూడా కోత పడినట్లు సమాచారం. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు కొంతమంది ప్రతి రోజు ముఖ ఆధారిత హాజరు వేసినా అది డేటా బేస్‌కు వెళ్లక పోవడంతో గైర్హాజరుగా చూపిస్తున్నట్లు చెబుతున్నారు. ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అన్ని స్థాయిల్లోని ఉద్యోగులకు ఇక మీదట ఎఫ్ఆర్ఎస్ ఆధారంగానే జీతాలు చెల్లింపు జరుగుతుందని డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. నవంబరు నుంచే ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా జీతాల చెల్లింపులు జరుగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో ఇదే ఉత్తర్వులను నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు అమలు పరిచారు. ఇప్పుడు వైద్య, ఆరోగ్య శాఖలో మిగిలిన ఉద్యోగులకు దాన్ని విస్తరించారు.

వైసీపీ హయాంలో అమలు..

గత ప్రభుత్వం వైద్యఆరోగ్య శాఖలో ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానం ప్రవేశ పెట్టింది. అంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఉద్యోగి రోజుకు మూడు సార్లు హాజరు వేయాలన్న నిబంధనను గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఎఫ్ఆర్ఎస్ విధానంలో వైద్య శాఖ లో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది నిర్దేశించిన సమయంలో, నియమించిన ప్రదేశంలో ఉండి ముఖం చూపిస్తూ హాజరు వేయాలి. ఉదయం 9 గంటలకు ఇన్ పంచ్, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 మధ్య మిడ్ పంచ్, సాయంత్రం 4 గంటల ఔట్ పంచ్ వేయాలి. ఉదయం 9 నుంచి 9.10 నిమిషాల వరకు ఇన్ పంచ్ పడుతుంది. సమయం దాటితే హాజరు నమోదుకి సంబంధిత డ్రాయింగ్ అధికారి అనుమతి(అప్రూవల్) ఇవ్వాలి. వాస్తవానికి క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ విధమైన హాజరు విధానం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ప్రస్తుత ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. సమయంతో పని లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే క్షేత్రస్థాయి సిబ్బందిని ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై నిర్ణయం వస్తుందని ఎదురు చూస్తున్న తరుణంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఎఫ్ఆర్ఎస్‌ను ఏకంగా జీతాలకు లింక్ చేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.



సమయంతో ముడిపెట్టలేని ఉద్యోగం

వైద్య, ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది సమయంతో పనిలేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఉదాహరణకు ఓ గర్భిణీ నొప్పులు పడుతుంటే అది అర్ధరాత్రి అయినా సరే ఏఎన్ఎం, ఆశా కార్యకర్త బాధితురాలితో కలిసి ఆస్పత్రికి వెళ్లాల్సిందే. గ్రామంలో వాంతులు, విరేచనాలు వంటి ఎపిడిమిక్ ప్రబలినప్పుడు రాత్రి వేళ కూడా విధుల్లో ఉండాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ సమయం అని అనడానికి లేదు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాల్సిన సిబ్బందిని కూడా ఎఫ్ఆర్ఎస్ చట్రంలో బిగించి జీతాలు కోత అనడం వైద్య ఆరోగ్యశాఖలో నిరసనకు కారణం అవుతుంది.

అనాలోచిత నిర్ణయం అమలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు వెనక్కి తీసుకుంటారని ఆశించాం. అయితే ప్రభుత్వ పెద్దలకు తెలుసో లేదో తెలియదు కానీ ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ అమలు నిర్ణయం ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పిస్తుంది. ఆరోగ్య శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు అంటే జరగదు. సాయంత్రం 4 తర్వాత విధులు ఉండవు అంటే ఎఫ్ఆర్ఎస్ జీతాలకు లింక్ చేయండి. అధికారులు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

- మలినేని భానుమూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం

తూర్పు నియోజకవర్గంలో రోడ్డుపై గుంతల ప్యాచ్‌వర్క్‌లను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే నజీర్ అహ్మద్



రోడ్లపై గుంతలు లేకుండా చేస్తాం


- రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(కార్పొరేషన్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారులపై గుంతలు లేకుండా చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ(గుంతల రహిత ఆంధ్ర ప్రదేశ్) కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రోడ్లకు గుంతలు పూడ్చే కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరమ్మతు పనులను సంక్రాంతి లోపు పూర్తి అవుతాయన్నారు. చేపట్టిన రోడ్డు పని బాధ్యత సంవత్సరం పాటు కాంట్రాక్టర్ దేనన్నారు. సంవత్సరంలో రోడ్లకు ఏమైనా మరమ్మత్తులు వచ్చినా సంబంధిత కాంట్రాక్టర్ తిరిగి చేయాల్సి ఉంటుందని తెలిపారు. రోడ్లకు గుంతలు పూడ్చి వాహన దారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో హిమాని జంక్షన్ నుంచి ఆర్అండ్‌బీ రోడ్డుకు దాదాపు రూ.22 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లా స్థాయిలో ఆర్అండ్‌బీ రోడ్లకు మొదటి దశలో రూ.13 కోట్ల 36 లక్షలతో అనుమతులు మంజూరయ్యాయన్నారు. తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఐదేళ్ల నుంచి పట్టించుకోని రోడ్లను కూటమి ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి మరమ్మతులు చేస్తుందన్నారు. ఆరు కి.మీ మేర గుంటూరు - మద్రాసు హైవే, ఏటుకూరు లాంచెస్టర్ రోడ్డు నుంచి మూడు బొమ్మల సెంటర్ వరకు రోడ్ల గుంతలు పూడ్చడం జరుగుతుందన్నారు.

- భూసేకరణకు అత్యుత్తమ పద్ధతిపై సీఆర్‌డీఏ దృష్టి
- యజమానులకు మేలు చేసే అవకాశాల పరిశీలనకు కన్సల్టెన్సీ
- ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 41 గ్రామాలు.. 96.25 కిమీ పొడవున ఐఆర్ఆర్

అమరావతి ఐఆర్ఆర్‌లో ముందడుగు

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) నిర్మాణంలో సీఆర్‌డీఏ స్పీడ్ పెంచింది. ఇన్నర్ రింగ్‌రోడ్డుకు అవసరమైన భూముల సేకరణకు అత్యుత్తమ పద్ధతిని సూచించేందుకు కన్సల్టెన్సీని నియమించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. దీనికోసం శనివారం టెండర్లు పిలిచింది. ఐఆర్ఆర్ నిర్మాణానికి ఇటీవల అదానీ సంస్థ ముందుకు వచ్చిన నేపథ్యంలో సీఆర్‌డీఏ మరో ముందడుగు వేసింది. ఐఆర్ఆర్ ఫైనల్ అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో భూములను సేకరించడానికి ఎలాంటి పద్ధతి అనుసరించాలన్న దానిపై కన్సల్టెన్సీ తగిన ప్రతిపాదనలు సూచించాల్సి ఉంటుంది. భూములను తీసుకోవడానికి భూ సేకరణ విధానం ఉన్నప్పటికీ.. ఇంకా అత్యుత్తమ ప్రతిపాదన ఏమైనా ఉంటే.. అది ఆమోదయోగ్యంగా అనిపిస్తే దానిని అమలు చేసే అవకాశం ఉంది. భూములు ఇచ్చిన వారికి కూడా ప్రయోజనకరంగా ఉండాలన్నది సీఆర్‌డీఏ భావన. భిన్నవిధానాలతో కూడిన సలహాలు, సూచనలు, ప్రత్యామ్నాయాల కోసం కన్సల్టెన్సీ సంస్థను నియమించాలనుకుంటోంది. ఈ నెల 18 లోపు బిడ్లను సమర్పించాలని సీఆర్‌డీఏ అధికారులు టెండరులో పేర్కొన్నారు. బిడ్ దక్కించుకున్నాక నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలి. కన్సల్టెన్సీ నివేదిక వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటారు.



ఇన్నర్ రింగ్ రోడ్డు శాటిలైట్ మ్యాప్

నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకుని..

అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇన్నర్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. రాజధానికి ప్రాంతీయ రోడ్లు అనుసంధానమయ్యేలా ఐఆర్ఆర్ నిర్మించడం మొదటి అంశం. విజయవాడ నగరానికి ట్రాఫిక్ సమస్యను తగ్గించడం రెండో అంశం. రాజధాని ప్రాంత పరిధిలోని మేజర్ రోడ్లన్నింటినీ అనుసంధానం చేయడం మూడో అంశం. అమరావతి, విజయవాడ చుట్టుపక్కల అర్బన్ ప్రాంతాల అనుసంధానం నాల్గో అంశం. మొత్తం 96.25 కిలోమీటర్ల పొడవున 75 మీటర్ల వెడల్పుతో ఈ ఐఆర్ఆర్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక ను రూపొందించారు. ఐఆర్ఆర్ కోసం మొత్తంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో 41 గ్రామాల పరిధిలో భూములను సేకరించాల్సి ఉంది.

ఐఆర్ఆర్ వెళ్లే గ్రామాలు ఇవీ..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అమరావతి మండలంలో ఎండ్రాయి, కర్లపూడి, వైకుంఠపురం, దుగ్గిరాల మండలంలో తుమ్మపూడి, మంగళగిరి మండలంలో చినకాకాని, చినవడ్లపూడి, కాజా, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, తాడికొండ మండలంలో కంతేరు, మోతడక, తాడికొండ, తుళ్లూరు మండలంలో అనంతవరం, హరిశ్చంద్రాపురం, పెదపరిమి, వడ్డమాను గ్రామాలు ఉంటాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో.. జి.కొండూరు మండలం కవులూరు, వెలగలేరు, గన్నవరం మండలంలో రామచంద్రాపురం, సావారిగూడెం, వెదురుపావులూరు, ఇబ్రహీంపట్నం మండలంలో దాములూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కేతనకొండ, కొండపల్లి, కొటికలపూడి, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, పెనమలూరు మండలంలో చోడవరం, గంగూరు, పెనమలూరు, పోరంకి.. విజయవాడ రూరల్ మండలంలో దొనె ఆత్కూరు, నిడమానూరు, నున్న, పాతపాడు, తాడేపల్లి, కొత్తూరు గ్రామాలు ఉన్నాయి.



మాచర్ల ఎమ్మెల్యే బావమరిదిపై రౌడీమూక దాడి

- పోలీసులకు ఫోన్ చేసి సమాచారమిచ్చిన బాధితుడు
- దాడికి పాల్పడిన యువకులపై ప్రతి దాడి

6

అడుగు పెడుతూనే కొత్త ప్రపంచం

- రెస్టారెంట్ ఆన్ వీల్స్
- రైల్వే కోచ్ రెస్టారెంట్లకు పెరుగుతున్న ఆదరణ



8

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ

జిల్లా కార్యాలయము, కలెక్టరేట్ కాంపౌండ్, గుంటూరు. ఫోన్ : 0863-2321149, 7702003536.

టెండర్ నోటీస్ నెం. LPG/18/2024-25 **(2వ పిలుపు)** తేది:02.11.2024

యల్.పి.జి. సిలిండర్ల డోర్ డెలివరీ రవాణా నిమిత్తము టెండరు ప్రకటన

2024-25వ ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి జిల్లా పౌర సరఫరాల సంస్థ, గుంటూరు వారి ఆధ్వర్యములో నిర్వహించుచున్న LPG Retail Outlets, గుంటూరు మరియు తెనాలి నందు గల పినపాడు వినియోగదారులకు LPG సిలిండర్ల రవాణా మరియు డోర్ డెలివరి చేయుటకు "డోర్ డెలివరీ కాంట్రాక్టర్" నియామకమునకు గాను ఆసక్తి ఉన్న వ్యక్తులు / ఏజెన్సీల నుండి సీల్డ్ టెండర్లు కోరడమైనది.

టెండరు ఫారములు నియమ నిబంధనల పత్రములకు రూ. 6,000/- బ్యాంకు డ్రాఫ్ట్ రూపములో ఏదైన షెడ్యూల్ మరియు జాతీయం చేయబడిన బ్యాంకులు నుండి జిల్లా మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు గుంటూరులో చెల్లింపబడునట్లుగా దాఖలు చేసి టెండర్ ఫారం మరియు సంబంధిత పత్రములను అన్ని పనిదినములలో జిల్లా మేనేజర్, గుంటూరు వారి కార్యాలయము నందు పొందగలరు.

(1) టెండర్ ఫారం పొందు తేదీలు : 04.11.2024 ఉదయము నుండి 11.11.2024 మధ్యాహ్నము 02.00ల వరకు

(2) టెండర్ ఫారంలు స్వీకరించు తేది : 11.11.2024 మధ్యాహ్నము 3.00 గం.ల వరకు

(3) టెండర్లు తెరుచు తేదీ : 12.11.2024 ఉదయము 11.00 గం.లకు (టెక్నికల్ బిడ్). మధ్యాహ్నం 3.00గం.లకు (ఆర్థిక బిడ్)

(4) టెండర్ ప్రాసెస్ జరుగు ప్రదేశము : జిల్లా సంయుక్త కలెక్టర్ కార్యాలయం, కలెక్టర్ ఆఫీస్, గుంటూరు.

సదరు టెండర్లు పరిశీలన అనంతరము రద్దు చేయటకు, తిరస్కరించుటకు మరియు కొత్తగా టెండర్లు పిలుచుటకు సంయుక్త కలెక్టర్, గుంటూరు వారికి పూర్తి అధికారము కలదని తెలియజేయడమైనది. ఇతర వివరముల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు : 9963479159 & 7702003567.

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఎక్స్ అఫీషియో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, గుంటూరు జిల్లా.

విజయవంతమైన వివా విద్యార్థుల ఆవిష్కరణలు



వివా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జర్మనీ విద్యార్థిని

పెదకాకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలోచన, పరిజ్ఞానాన్ని పంచుకుంటూ సృజనాత్మకతకు సాంకేతిక మేళవింపుతో వివా విద్యార్థులు జర్మనీ విద్యార్థులతో కలసి రూపొందించిన నూతన ఆవిష్కరణలను వివా పాఠశాల వేదికగా విజయవంతంగా శనివారం ప్రదర్శించారు. మేక్థాన్-2024లో భాగంగా జర్మనీకు చెందిన ఓం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బెర్నార్డ్ ఆధ్వర్యంలో వివా పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు, జర్మనీ న్యూరెంబర్గ్ నగరానికి చెందిన డ్యూరర్, మార్టిన్ బెహెం పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు మూడు బృందాలుగా ఏర్పడి రూపొందించిన మూడు అవిష్కరణలు బ్లైండ్ స్టిక్ (కళ్లులేని వారిని రహదారులపై అప్రమత్తం చేసే చేతికర్ర), ఎకో మోషన్ మూస్, (పల్స్ పెడల్)నాడీ వేగాన్ని అదుపులో ఉంచే సైకిల్ పెడల్‌లను ముఖ్యఅతిథి మాజీ డీజీపీ మాలకొండయ్య, ప్రముఖ పారిశ్రామిక వేత్త లావు నాగేశ్వరరావు, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమక్షంలో ప్రదర్శించారు. మూడు దశలలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి దశ అంతర్జాలం ద్వారా నిర్వహించగా విద్యార్థులు వారి ఆలోచనలను పంచుకొని మూడు ఆవిష్కరణలను ఎంచుకున్నారు. రెండో దశలో వివా విద్యార్థులు జర్మనీలో నిర్వహించిన మేక్థాన్‌లో పాల్గొని ఆవిష్కరణల రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. మూడో దశలో భాగంగా జర్మన్ విద్యార్థులు వివా పాఠశాలలో విజయవంతంగా ఆవిష్కరణలను రూపొందించారు. ముఖ్యఅతిథి మాలకొండయ్య మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆధారిత విద్య అనేది విద్యార్థులకు అవసరం అన్నారు. లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి మేక్థాన్లు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రొఫెసర్ బెర్నార్డ్ మాట్లడుతూ ఒకే ప్రాంగణంలో కళాశాల, పాఠశాల ఉండటం ద్వారా ఈ మేక్థాన్ నందు సాంకేతిక అంశాలలో పరిష్కారాలను సులువుగా సాధించగలిగామని తెలిపారు. వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎల్ కమాండర్ కె.ఎస్ రావు, ఉపాధ్యయులు ఎ.కె.మాధవి, వై.ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షా కేంద్రాల తనిఖీ

పెదకాకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ (యూజీ) 3వ సెమిస్టర్ రెగ్యులర్ అండ్ సప్లమెంటరీ పరీక్షల కేంద్రాలను డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.వి.కృష్ణారావు శనివారం తనిఖీ చేశారు. మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్, వీజేపీ కళాశాలలను సందర్శించారు. పరీక్షల కేంద్రాల్లో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు.


కృష్ణానదిలో మునిగి ఇద్దరు యువకులు మృతి

అమరావతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిడుగు గ్రామం వద్ద కృష్ణానదిలో ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం లింగాపురం గ్రామానికి చెందిన యువతి బాప్టిజం తీసుకునేందుకు మండల పరిధిలోని దిడుగు గ్రామం వద్ద పాస్టర్ పి.పరంజ్యోతితో వెళ్లారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆమె బంధువులు కూడా కృష్ణానది వద్దకు వెళ్లారు. వీరిలో లింగాపురం గ్రామానికి చెందిన కంభంపాటి యెహాన్(32), మంగళగిరికి చెందిన గోశ ధనుస్సు(22) ఇద్దరు నదిలోకి దిగడంతో ప్రమాదవశాత్తు నీటిలోకి జారి గల్లంతైయ్యారు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టగా ఇరువురి మృతదేహాలు లభ్యమైనాయి. యేహాన్ పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుండగా, ధనుస్సు విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. యేహానుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌హెచ్‌ఓ ఎం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అమరావతిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ


దుస్తుల కిట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు,అధ్యాపకులు

గుంటూరు(విద్య) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విజయవాడలోని వరదబాధితులకు శనివారం దుస్తులు పంపిణీ చేసినట్లు వీసీ ఆచార్య పి.నాగభూషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని దాములూరు, చిలుకూరు గ్రామాల్లో దుస్తుల కిట్లు అందజేశామని వివరించారు. వర్శిటీ ఆధ్వర్యంలో రూ.10 లక్షల విలువైన దుస్తులు అందజేశామని, ఇందులో దాములూరు ముంపు గ్రామంలో 850 మంది కుటుంబాలకు, చిలుకూరులో 400 కుటుంబాలకు కిట్లు అందజేశామని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీరావు తదితరులు అభినందించారు.



ఉద్యోగావకాశాలు

→ Wanted One Computer Operator & One Accountant (Female) for Reputed College at Phirangipuram. Contact No: 90528 94234.
AJG-203657

→ Wanted Retired Officer/ Superindent to work for Reputed NGO at Guntur. Contact No: 90528 94234.
AJG-203658

→ గుంటూరు నందు గల ప్రముఖ NGO సంస్థ నందు పనిచేయుటకు డ్రైవర్లు కావలెను (ఆటో ట్రాన్స్‌మిషన్) నందు అనుభవం కలిగి వుండవలెను. శాలరీ : 17500/-, Contact No: 90528 94324.
AJG-203659

→ గుంటూరు సిటీలోని ప్రముఖ స్వీట్ షాపు నందు పనిచేయుటకు హెల్పర్లు కావలెను. సంప్రదించండి సెల్ : 9866132826, 9441121025.
AJG-203539

→ గుంటూరు సిటీ, బృందావన్ గార్డెన్స్ ప్రముఖ రెస్టారెంట్లో పనిచేయుటకు లేడీ స్టీవార్డ్స్ - 5గురు మంచి జీతము + వసతి కల్పించబడును. కనీసం 1 సంవత్సరం అనుభవం కలవారు మాత్రమే కావలెను. సంప్ర॥ 95732 68961, 6281177373.
AJG-203267

→ గుంటూరు సిటీలోని పట్టాభిపురం, 3వ లైన్ నందు 75 సంవత్సరాల మనిషికి హెల్పర్‌గా 40 నుండి 45 లోపు లేడీ హెల్పర్ కావలెను. సంప్ర॥ 98668 06061.
AJG-203537

→ FMCG కంపెనీలో Order Booking & Delivery కొరకు Boys కావలెను. Qul : 10th / Inter. Freshers అయినా పరవాలేదు. Cont : 92467 82585, 92464 82585.
AJG-203269

→ గుంటూరు సిటీలోని ప్రముఖ మెడికల్ షాపు నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. జీతం : 15K to 20K సంప్ర॥ 90008 12161.
AJG-203536

→ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను MBA పాసైన, పాస్ కాకపోయిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు యువతి / యువకులు కావలెను. స్వయంగా కలవండి. శాంతి ఆర్ట్స్ గ్యాలరీ, 4/3 అరండల్‌పేట, బ్యాంక్ ఆఫ్ బరోడా బిల్డింగ్ 2వ ఫ్లోర్, గుంటూరు. సెల్ : 99480 84001.
AJG-203538

→ అద్దంకి సమీపంలో కుంకుపాడు క్వాం టెక్స్ టైల్స్‌కి సెక్యూరిటి గార్డు, హెడ్ గార్డ్స్, లేడీ గార్డ్స్ కావలెను. ఉచిత వసతి + సబ్సిడీ, భోజన సదుపాయం. వెంటనే సంప్ర॥ 98480 91341, 9346176356
RK-1828

→ గుంటూరు, పరిసర ప్రాంతాలలో ప్రముఖ పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు యువకులు కావలెను. Q: డిగ్రీ, జీతం : 15,000 /- TA+DA -3000, (టూ వీలర్ కావలెను). సంప్ర॥ 8185046367.
AJG-203567

→ Tata Steel Door & Windows గుంటూరు జిల్లా నందు మార్కెటింగ్ చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 2 సం॥ల అనుభవం. సంప్ర॥ 91009 94692.
AAA-9390

→ టాటా పవర్ హోమ్ సోలార్ సిస్టమ్స్ సేల్స్ ప్రమోషన్ కొరకు P/T, F/T మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలీకాలర్స్, టెక్నికల్ & బిజినెస్ అసోసియేట్స్, ఏజెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన ఆదాయం. సంప్ర॥ 9392227337.
MA-206

→ శ్రీ శ్రీ శ్రీ బాలా త్రిపురసుందరి శ్రీ విద్యాపీఠం నందు పీఠం వర్క్స్ చేయుటకు అసిస్టెంట్స్ యువతీ యువకులు కావలెను 10th మరియు ఇంటర్మీడియట్ అయినా ఓకే పీఠం నెంబర్: 8790951565, 9666568209
AJH-002714

వాహనాల అమ్మకము

→ కారు అమ్మబడును Indus Ind Bank. (1) AP 39GX 2655 - Honda WR-V Model - 2020, (2) AP39HM 8924 - Maruti Ertiga VXI Model - 2020, (3) AP16DQ 4224 - Maruti Ertiga ZDI+ Model - 2017, (4) AP16 DA 4355 - Maruti Ertiga VDI Model. Cont : 9959350260, 9666180221.
RK-1826

BUSINESS

→ ప్రముఖ MNC కంపెనీకి Cameras Distribution చేయుటకు dealers కావలెను. ఆకర్షణీయమైన ధరలో లభించును. అధిక మొత్తంలో లాభాలు సంపాదించుటకు ఉత్సాహమయిన డీలర్స్ కావలెను. Cont: 6309624219, 9989592151
AJH-0977

అమ్మకము

→ German Shepherd Puppies, Double Coat Excellent Breed for Sale. Contact No: 89199 41974
AJG-203651

→ గుంటూరు షాప్ ఎంప్లాయిస్ కాలనీ, మెయిన్ రోడ్డు బస్టాండ్ దగ్గరలో పడమర 22 1/2 అడుగులు, దక్షిణం : 30 అడుగులు కొలతలు కార్నర్ స్థలం 76 1/2 గజములు స్థలం అమ్మకానికి కలదు. సంప్రదించండి ఫోన్ : 9441033069.
AJG-203531

→ తిరుపతి జిల్లా ఓజిల్ మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు. సంప్ర: 94401 83778
AJN-193091

రియల్ ఎస్టేట్

→ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా, మరెక్కడైన అ॥కొ॥ జనచైతన్య మా ప్రత్యేకత. సంప్ర॥ 73823 96677.
AJG-981

స్థలం అమ్మకము

→ గుంటూరు, నరసరావుపేట రూట్లో, గుంటూరు నుండి 17 కి.మీ.ల దూరంలో, రెండు పక్కల తారు రోడ్డు అనుకొని 725 గజాల స్థలం కలదు. పక్కన గజం 7000 అయితే, మా ధర గజం 6500లు మాత్రమే. ఫోన్ : 9032380696
AJG-203571

→ గుంటూరు, RTC కాలని మెయిన్ రోడ్డు, భాష్యం స్కూలు ఎదురు 60 అడుగుల రోడ్డు ఉత్తరం ఫేసింగ్ కమర్షియల్ 225 చ॥గ॥ స్థలము అమ్మకమునకు కలదు. సంప్ర॥ 94417 17250.
AJG-203180

→ బాపట్ల జిల్లా మేదరమెట్ల దగ్గర దైవాల రావూరు గ్రామంలో వ్యవసాయ భూమి 7 ఎకరాలు అమ్మబడును. సంప్రదించండి: 9989157441 / 9908862323
AJH-002715

ఇల్లు అమ్మకము

→ గుంటూరు సిటీ, నవభారత్ నగర్ 3వ లైన్ లైబ్రరీ ఎదురు, సౌత్ వెస్ట్ కార్నర్, వెస్ట్ ఫేసింగ్ 453 చ.గ.లలో 3BHK Independent House అమ్మకానికి కలదు. Ph. 9515861795.
AJG-203514

ఇల్లు అమ్మకం

→ 30X55, 184 గజములు, ఉత్తరం ఫేస్, 2 బిల్డింగ్‌లు కల్గిన స్థలం, అమ్మకానికి కలదు. (హాస్పిటల్, స్కూల్, హాస్టల్‌కి అనుకూలం) ప్రస్తుతం 5 కాపురాలు నివాసం ఉన్నారు. గుంటూరు, కొత్తపేట శివాలయం ఎదురు వీధి, 12-14-7, రాఘవేంద్ర హాస్పిటల్ దగ్గర, సంప్ర॥ 99855 11611.
AJG-191843

FLAT FOR SALE

→ తెనాలి గాంధీచౌక్‌లో 2BHK ఫ్లాట్ Sft. 1050/1100 కలదు. 100% వాస్తుతో, అప్రూవ్డ్ ప్లాన్, సూపర్ డిస్కౌంట్ ఆఫర్ 40-42 లక్షలలో. సంప్ర॥ V. కిషోర్, 9121013545.
AJG-203573

→ గుంటూరు సిటీలోని విద్యానగర్ 3/7లో కాకతీయ రోడ్డులో నిహారికా హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో 2BHK, 3BHK అన్ని వసతులతో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. సంప్ర॥ సెల్ : 9246483447, 9490639699.
AJG-203535

→ గుంటూరు, విద్యానగర్ 3/10వ లైన్‌లో శ్రీభార్గవ కనస్ట్రక్షన్స్ నందు 2800 చ॥అ॥ల 3BHK ఫ్లాట్స్ ఫుల్ ఫినిషెడ్, రెడీ టు అక్యూపై. సంప్ర॥ 7989456509, 9542757575.
AAA-9388

→ ప్రీమియం 2BHK 1024 Sft, తూర్పు ఫేసింగ్ ఫుల్ ఫినిష్డ్ 15 ఫ్లాట్స్ గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. రేరా అప్రూవ్డ్ ప్రాజెక్టు XXX సబ్బుల కంపెనీ వెనుక, గోరంట్ల, గుంటూరు. సెల్ :+91 94935 85777
AJG-203401

→ గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు భగత్‌సింగ్ బొమ్మ దగ్గరలో రెడీ టూ అక్యుపై 3BHK - 2300 Sft. డ్యూప్లెక్స్, 2BHK - 1150 Sft. ఫుల్లీ ఫినీష్డ్, లగ్జరీ ఫ్లాట్ అమ్మకం. సంప్ర॥ 9490960449.
AA-973

→ తాడేపల్లి పాతూరు రోడ్డులో YSR బొమ్మ సెంటర్ దగ్గర, తూర్పు, పడమర ఫేసింగ్‌తో, గృహ ప్రవేశమునకు సిద్ధముగా 3 BHK లగ్జరీ ప్రీమియం ఫ్లాట్స్ (4272 sft.,) 2 కార్ల పార్కింగ్, అన్ని సౌకర్యములతో అమ్మకమునకు కలవు. USD : 135 చ.గ ✆ 92464 95388
AJB - 298

→ గుంటూరు, కొరిటెపాడు సాయిబాబా రోడ్ 4వ లైన్‌లో శ్రీభార్గవ కనస్ట్రక్షన్స్ నందు 1150 2BHK & 1660, 3BHK ఫ్లాట్స్ ఫుల్ ఫినిషెడ్, రెడీ టు అక్యూపై. సంప్ర॥ 7989456509, 9542757575.
AAA-9389

→ పల్లిక నివాస్. ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే గేటు దగ్గర, అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2 BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ 42 లక్షలకే. సంప్ర॥ 9848110543, 8885566086
AJV-4175

అద్దెకు

→ గుంటూరు, విద్యానగర్ 3/2 North East Corner, First Floor, Two Bed Room House మరియు బట్టల షాపు విడి విడిగా కాని లేక రెండు కలిపి కాని అద్దెకు ఇవ్వబడును. +91 90520 43456 (Only what's app call), 99851 77987
AJG-203656

→ గుంటూరు, సిటీలోని పట్నం బజారు TMB బ్యాంకు ఎదురు RMK కాంప్లెక్స్‌లో తూర్పు ఫేస్ పెద్ద షాపు గోడౌన్, ఆఫీసులకు అద్దెకు కలదు. సంప్ర॥ 99895 92958, 9885789117.
AJG-203509

→ గేదెల ఫారం, తెనాలి దగ్గర కొలకలూరు నుండి కోపల్లె వెళ్ళు రోడ్డు ప్రక్కన ఎ॥ 1.25 మెరక పొలం చుట్టు ఫెన్సింగ్, 2 పెద్ద షెడ్లు, బోరు, 24 గం॥ కరెంటుతో ఉన్నది గేదెలు, కోళ్ళు, గొర్రెలు, కుందేళ్ళు పెంపకానికి అద్దెకు కలదు. సంప్ర॥ 98667 32178.
AJG-203557

→ గుంటూరు సిటీలోని అర్.అగ్రహారం నందు 7 గొందుల సందు డోర్ నెంబర్ : 24/4/46 లో 2వ అంతస్తులో 2BHK అద్దెకు కలదు. సంప్ర॥ 98490 66359
AJG-203534

→ తెనాలి గాంధిచౌక్ R.R. ఫర్నిచర్ బిల్డింగ్ 600 చ॥అడుగులు గల 3 అంతస్థుల బిల్డింగ్ అద్దెకు కలదు. సంప్ర॥ సెల్ : 9966029044.
AJG-203033

పోయినవి

→ గుంటూరు చంద్రమౌళీనగర్ 7/1, D.No: 5-90-46/14 నివాసి, సూరం శేషిరెడ్డి కుమారుడు సూరం వెంకటేశ్వరరెడ్డి (అధార్ నెం. 803191 890931) అను నేను నా తాలూకు ఆస్తికి సంబంధించిన డ.నెం. 4041/2016రు విక్రయ దస్తావేజు ఒరిజినల్‌ను మరియు డ.నెం. 925/ 2016రు గల లింకు దస్తావేజును తీసుకొని నా ఇంటి నుండి గుంటూరు నగరం పాలెం కలెక్టర్ ఆఫీస్ పక్కన గల రిజిస్ట్రేషన్ ఆఫీసు వద్దకు జిరాక్స్ తీయించుటకు వెళ్లుచుండగా ఎక్కడో జారి పోయినవి. దొరికిన వారు సంప్ర॥ +91 70130 82768
AJG-203268

SERVICES

→ ఖాళీ స్థలాలపై లోన్స్/హోమ్ లోన్స్/ప్రోపర్టీ లోన్స్/బిజినెస్ లోన్స్/పర్సనల్ లోన్స్/ టేకోవర్ లోన్స్ - 20 సం. వరకు చేయబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర: 73968 33074.
AJB -4479

చెదల నివారణ

→ చెదపురుగులు, బొద్దింకల నివారణ 5 సం॥ గ్యారంటీ. AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ లావ్సర్ పెస్ట్ కంట్రోల్, పట్నం బజారు, గుంటూరు. ఫోన్ : 8978672824, 9848131213
AA-982

బిల్డింగ్ డిమాలిష్

→ పాత బిల్డింగ్‌లు, రేకుల షెడ్‌లు, పెంకుటిల్లు, పగుల గొట్టి, నేలమట్టం చేసి ఇవ్వబడును. పాత కలప, దర్వాజాలు, కిటికీలు, రేకులు కొనబడును. సంప్ర॥ 9573932108.
RK-1827

→ పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగుల గొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. సంప్ర॥ 97032 90782, 9700442419
AA-983

లీకేజీ సమస్యలా?

→ బాత్ రూమ్ లీకేజి గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్ క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజిపైనైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్ర॥ 9642458892
AJG-203517

EDUCATION

→ APOSS ద్వారా డైరెక్ట్ - 10th / ఒకే సం॥లో ఇంటర్, దూర విద్యా ద్వారా BA / B.Com, B.Sc / M.A / M.Sc / MBA/ MCA. శ్రీ వర్షిణి, 2/6, బ్రాడీపేట, గుంటూరు-2, ఫోన్ : 0863-2246006 / 9440214612 / 9553534072 / 9652146801.
RK-1825

→ ఓపెన్ 10th, ఇంటర్ మరియు B.A, B.Com, B.Sc, M.A, M.Com, M.Sc, MBA, MCA లకు ఉత్తమ శిక్షణ ఇవ్వబడును. సంప్ర॥ శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 73967 55801.
NAM-227

→ లాంగ్ టర్మ్ కోచింగ్ ఫర్ EAPCET-2025 (AP&TS), అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యాబోధన. హాస్టల్ వసతి కలదు. ఇంటర్ ట్యూషన్స్ చెప్పబడును. శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 73967 55801.
NAM-262

→ B.Tech/Degree/Diploma ఇప్పుడు మీరు మీ డిగ్రీని ఆమోదిత విశ్వవిద్యాలయాలలో క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ విధనంలో పూర్తి చేయవచ్చును. ఆమోదిత సంస్థ - ప్రభుత్వ ఉద్యోగాలకు వర్తించును. సం॥ప్ర॥ 8330964279.
AJW-199039

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు 99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

విద్యార్థులను చితకబాదిన హాస్టల్ వాచ్‌మన్

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- వాచ్‌మన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు


తల్లిదండ్రులను విచారిస్తున్న ఎస్ఐ మధుపవన్

పెదనందిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు విద్యార్థులను హాస్టల్ వాచ్‌మన్ చితకబాదిన సంఘటన శనివారం మండల కేంద్రం పెదనందిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు అమరావతి మండలం చిలుమూరు గ్రామానికి చెందిన గోవిందు నాగార్జున, లక్ష్మీఅన్నపూర్ణల ఇద్దరు కుమారులు జి. జ్యోతిరాజేష్, మోహన్‌ఆదిత్యలు ఈ ఏడాది స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో చేరి జిల్లా పరిషత్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. ఇటీవల దీపావళి పండగకు ఇంటికి వెళ్లారు. సెలవులు ముగియడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల వద్ద వదిలిపెట్టేందుకు వచ్చారు. పాఠశాలకు వెళ్లమంటూ ఇరువురు విద్యార్థులు ఏడుస్తుండగా తల్లిదండ్రులు నచ్చజెప్పి వారిని వదిలిపెట్టి వెళ్లి పోయారు. అప్పటికే పాఠశాల వద్ద హాస్టల్ వాచ్‌మన్ విద్యార్థులను ఎందుకు ఏడుస్తున్నారు, పాఠశాలకు ఎందుకు వెళ్లరని మందలించి విచక్షణారహితంగా కొట్టారు. దీంతో ఇరువురు తలకు, కాళ్లకు గాయాలవ్వడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులపై దాడిచేసిన వాచ్‌మన్, కమాటీ సస్పెన్షన్

గుంటూరు(విద్య), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో విద్యార్థులపై దాడి చేసిన హాస్టల్ వాచ్‌మన్, కమాటీలను విధుల నుంచి తొలగిస్తూ సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలుర వసతి గృహంలో పొరుగుసేవల విభాగంలో పనిచేస్తున్న షేక్ అబ్దుల్ వహాబ్, కమాటీలు బాలురపై దాడి చేసి కొట్టినట్లు ఏబీఎన్ ఆంధ్రజ్యోతితోపాటు ఇతర మీడియాలో శనివారం కథనాలు వెలువడ్డాయి. దీంతో తెనాలి సహాయ సంక్షేమశాధికారితో విచారణ జరిపించి ఇద్దరిని విధుల నుంచి తప్పించినట్లు డీడీ మధుసూదనరావు వెల్లడించారు.

ఎమ్మెల్యే బావమరిదిపై రౌడీ మూక దాడి

- పోలీసులకు ఫోన్ చేసి సమాచారమిచ్చిన బాధితుడు
- దాడికి పాల్పడిన యువకులపై ప్రతి దాడి
- పోలీసుల అదుపులో పలువురు నిందితులు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తనకి ఇవ్వాల్సిన డబ్బులు గురించి అడగడానికి వెళ్లిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బావమరిది కృష్ణారెడ్డి ఆయన స్నేహితుడు మాధవరావులపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసిన ఘటన పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్యామలనగర్ సమీపంలోని రవీందర్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి బావమరిది కృష్ణారెడ్డికి బిల్డర్ బీ. సుబ్రహ్మణ్యేశ్వరరావు రూ. 80 లక్షలు ఇవ్వాల్సి ఉంది. సుబ్రహ్మణ్యేశ్వరరావు డబ్బులు ఇవ్వకపోవడంతో కృష్ణారెడ్డి కోర్టులో కేసు వేశాడు. కొంతకాలంగా డబ్బులు ఇవ్వాల్సిన సుబ్రమణ్యేశ్వరరవు కనిపించకుండా పోయాడు. అలాగే సుబ్రమణ్యేశ్వరరవు తనకు అటాచ్‌మెంట్ చేసిన ప్లాట్లను వేరొకరికి విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న కృష్ణారెడ్డి అదే ప్లాట్లో అద్దెకుంటున్న టీడీపీ నాయకుడు రామకృష్ణ ద్వారా సుబ్రహ్మణ్యేశ్వర కదలికలను తెలుసుకున్నాడు. శనివారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వర రావు ఇంట్లో ఉన్నట్లు రామకృష్ణ ఫోన్ చేసి చెప్పడంతో కృష్ణారెడ్డితో పాటు, విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఉండే మాధవరావు కలిసి రవీందర్ నగర్ లోని టెంపుల్ 10 అపార్ట్మెంట్ వద్దకు వెళ్లారు. అక్కడ సుబ్రహ్మణ్యేశ్వరరావుతో కృష్ణారెడ్డి, మాధవరావు గొడవపడుతుండగా, గమనించిన సుబ్రహ్మణ్యేశ్వర రావు కుమారుడు రిషి తన స్నేహితులకు ఫోన్ చేశాడు. దీంతో మద్యం తాగివున్న సుమారు 10 మంది యువకులు వచ్చి కృష్ణారెడ్డి, మాధవరావులపై దాడి చేసి కొట్టారు. దీంతో మాధవరావు 100కి ఫోన్‌చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అనుకున్న పట్టాభిపురం ఎస్ఐ నరహరి సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లేసరికే వారంతా కారు ద్విచక్ర వాహనాలపై పరారయ్యారు. అనంతరం ఎస్ఐ నరహరి, సిబ్బంది గాలింపు చేపట్టి పట్టాభిపురం రిషి, కృష్ణారెడ్డి అనుచరులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. మాధవరావు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే రవీంద్ర నగర్ ఇంటి వద్ద కృష్ణారెడ్డి మాధవరావులపై రిషి అతని నేస్నేరులు దాడి చేసి కొట్టినట్లు సమాచారం అందుకున్న విహెచ్పి నాయకుడు బెహరా అనిల్ తన అనుచరులతో అక్కడికి వెళ్ళాడు. దీంతో పోలీసులు మిగిలిన నిందితులతో పాటు బెహరా అనిల్ అతని అనుచరులను కూడా అదుపులోకి తీసుకున్నారు.

అండర్ - 19 నెట్ బాల్ జట్టు ఎంపిక

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 నెట్ బాల్ జట్ల ఎంపికను చిలకలూరిపేట పట్టణంలోని ఏఎంజీ పాఠశాల ప్రాంగణంలో శనివారం ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 19 కార్యదర్శి నరసింహారావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుంటూరు జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో ఈ బాల, బాలికల జట్లు ఆడనున్నాయి. అండర్ - 19 బాలుర జట్టుకు అఖిల్, మనోజ్ కుమార్, గోపీకృష్ణ, నిఖిల్, విష్ణు, అహమ్మద్ ఆర్షాఫ్, నాగ శివ, సరేంద్ర, డానీ, చరణ్, దుర్గా ప్రసాదు, సాయికృష్ణ, కౌషిక్ ఎంపికయ్యారు. కాగా బాలికల జట్టుకు సంజన, అంజు, సాహీర, వెంకట రమణ, హస్న, యమున శ్రీ, శ్రీదివ్య, మౌనిక, సానియా, లిఖిత, జెస్సిక, అర్చనలు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వారిని సహాయ కార్యదర్శి పద్మాకరరావు, హెచ్ఎం కృపాదానం తదితరులు అభినందించారు.

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలపై అరెస్టు

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావుపై, ఆయన అనుచరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో తాడేపల్లిలోని వైసీపీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు పాలేటి కృష్ణవేణి (33) శనివారం అరెస్టు అయ్యారు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో తాడేపల్లికి వెళ్లి ఆమెను అరెస్టు చేసి చిలకలూరిపేట కోర్టులో శనివారం సాయంత్రం హాజరు పరిచారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్ ఆఫీస్ : 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002.
పొన్నూరు బ్రాంచి : డోర్ నెం.17-4-1, రామాభవన్, ఎస్.పి.పి రోడ్, పొన్నూరు-522124

ఋణగ్రహీత/ సహ-పూచీదారు/ హామీదారు లకు సర్ఫేసి చట్టము 2002 సెక్షన్ 13(8) క్రింద రిడంప్షన్ నోటీసు

లోన్ నెం: ML/005300400001703

To: ఋణగ్రహీత & ఆస్తి యజమాని: శ్రీమతి దీవి లీలా శ్రీ గారు, భర్త: శ్రీ దీవి యోగానంద్, డోర్ నెం.1-12-37, 1వ లైను, భావనగర్ కాలని, ట్రీవెలర్స్ బంగ్లా రోడ్డు, ఎం.డి.ఓ. ఆఫీస్ ప్రక్కన, పొన్నూరు, గుంటూరు జిల్లా, పిన్‌కోడ్:522124, సహ-పూచీదారు: శ్రీ అగ్నిహోత్రం వెంకట సీతాలక్ష్మి శోభనాద్రి (మరణించినారు), తండ్రి: శ్రీ అగ్నిహోత్రం వెంకట సత్యనారాయణ, డోర్ నెం:7-28-66, అంజనేయ పంతులువారి వీధి, గంగానమ్మపేట, తెనాలి, గుంటూరు జిల్లా, పిన్‌కోడ్-522201, హామీదారు: శ్రీమతి దీవి సాయి సింధుజ, తండ్రి: శ్రీ దీవి యోగానంద్, డోర్ నెం:7-28-66, అంజనేయ పంతులువారి వీధి, గంగానమ్మపేట, తెనాలి, గుంటూరు జిల్లా, పిన్‌కోడ్-522201.

విషయము: సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్సుమెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సర్ఫేసి చట్టము, 2002 సెక్షన్ 13(8) క్రింద పొందు హక్కు ఉపయోగించుకోవలసినదిగా కోరుతూ 30 రోజుల ప్రకటన.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణముగా అమ్మకము నోటీసు ప్రచురణ తేదీకి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీ చేయబడుచున్నది.

1. లోను ఋణగ్రహీత మరియు ఆస్తి యజమాని అయిన శ్రీమతి దీవి లీలాశ్రీ గారు భర్త: శ్రీ దీవి యోగానంద్ గారు మరియు 2) శ్రీ అగ్నిహోత్రం వెంకట సీతాలక్ష్మి శోభనాద్రి గారు (మరణించినారు) తండ్రి: శ్రీ అగ్నిహోత్రం వెంకట సత్యనారాయణ గారు, కో-ఆబ్లిగెంట్ 3. దీవి సాయి సింధుజ గారు, తండ్రి: శ్రీ దీవి యోగానంద్ గారు గ్యారెంటర్‌గా ఉన్న లోన్ అకౌంట్ లోని బకాయి డి. 30-11-2023 నాటికి రూ. 45,23,067/- లు (అక్షరాల నలభై ఐదు లక్షల ఇరవై మూడు వేల అరవై ఏడు రూపాయలు మాత్రము) మరియు 01-12-2023 వ తేదీ నుండి వడ్డీతో కలిపి మొత్తము చెల్లించవలసినదిగా కోరుతూ, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, పొన్నూరు బ్రాంచ్ అధీకృత అధికారిచే 11-12-2023 వ తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయుటమైనది. డి. 11-12-2023న రిజిష్టర్ పోస్టు ద్వారా పంపిన డిమాండ్ నోటీసులు తిరిగి వచ్చినందున డి. 28-12-2023న న్యూస్ పేపర్ పబ్లికేషన్ ద్వారా డిమాండ్ నోటీసు జారీ చేయటమైనది. పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తమును తిరిగి చెల్లించుటలో మీరు విఫలమైనందున ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, పొన్నూరు బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి 05-03-2024 తేదీన మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మక/భౌతిక స్వాధీనము తీసుకున్నారు మరియు చట్ట ప్రకారము సదరు స్వాధీన నోటీసును ఆంధ్రజ్యోతి (తెలుగు) మరియు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్) దినపత్రికలలో 11-03-2024 ప్రచురించుటమైనది. తదుపరి కోర్టు కమీషనర్ గారి ద్వారా 24-09-2024 తేదీన సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకొనినాము.

ఈ నోటీసు తేదీ నుండి 30 రోజుల లోగా మీరు 31-10-2024 వ తేదీ వరకు ఉన్న లోను బకాయి మొత్తము రూ. 52,45,732.00 లు (అక్షరాల యాభై రెండు లక్షల నలభై ఐదు వేల ఏడు వందల ముప్పై రెండు రూపాయలు మాత్రము) మరియు 01-11-2024 వ తేదీ నుండి వడ్డీ ఇతర ఖర్చులు, ఛార్జీలు కలిపి మొత్తమును చెల్లించి బ్యాంకు వారు స్వాధీనము చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైతే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకము జరుపుటకు దినపత్రికలో అమ్మకము ప్రకటన ప్రచురించబడును.

ఏ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్‌లు ఆహ్వానించుట లేదా, బి) ప్రజల నుండి టెండర్ ఆహ్వానించుట లేదా సి) ఈ-వేలం పద్ధతిలో బహిరంగ వేలమును నిర్వహించుట లేదా, డి) ఆసక్తి గల వారికి ప్రైవేటు అగ్రిమెంట్ ద్వారా అమ్మకము జరుపబడును.

దిన పత్రికలలో అమ్మకము ప్రకటన ప్రచురించు తేదీకి ముందుగా సర్ఫేసి చట్టము యొక్క సెక్షన్ 13(8) ప్రకారము మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు. ఒక వేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారము మీ ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

సర్ఫేసి చట్టము నందు / అమలులో ఉన్న ఏదైనా ఇతర న్యాయ పరిధిలో బ్యాంకు నకు ఎలాంటి ఇతర హక్కులకు భంగము వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

రిజర్వు ధర: రూ. 55,49,000/- ఇ.ఎం. డిపాజిట్ : రూ. 5,55,000/-

అనుబంధము (ఆస్తి వివరములు)

శ్రీమతి దీవి లీలా శ్రీ డాక్యుమెంట్ నెం. 2168/2016 ఆస్తి వివరం

గుంటూరు డి. తెనాలి రి.డి. పొన్నూరు సబ్ డి యిలాకా, పొన్నూరు మునిసిపల్ ఏరియాలో చేరివుండి అసెస్‌మెంట్ నెం. 1025005156 రు గా గల్గివుండి ఇంకా డోరు నెంబరు రానటువంటి డోరు నెం. 1-12-35 రు కు సమీపమున గల పొన్నూరు గ్రామ డి.నెం. 387/1 బి రు మింజుమలే నీకు విక్రయించిన నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** ఇతరుల ఆస్తి హద్దు, అ.35 అ 0.6 లు, **దక్షిణం:** మునిసిపల్ రోడ్ హద్దు. అ. 47 అ 0.3 లు, **పడమర:** మునిసిపల్ రోడ్ హద్దు. అ. 34 అ. 0.6 లు, **ఉత్తరం:** బురదగుంట సార్లమ్మ గారి ఆస్తి హద్దు. అ.50 లు. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 189.09 లకు సరియగు చ.మీ. 158.83 లు శేటీ మెరక నివేశన స్థలమున్నూ సదరు స్థలములో చ.అ. 1701 లలో వున్న అర్.సి.సి. డాబా యిల్లున్నూ, లెట్రిన్, బాత్రూమ్ లున్నూ, కరెంట్ మీటరు నెం. 12657 గల కరెంటు మీటరున్నూ, సీటి పంపున్నూ, సదరు యింటి అమర్చివున్న యావద్విశిష్ట సామాగ్రి వగైరాలతో సహా. ప్రస్తుత డోర్ నెం. 1-12-37 రు.

తేది : 03-11-2024 సం/- అధీకృత అధికారి,
స్థలం : పొన్నూరు ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., పొన్నూరు బ్రాంచి, గుంటూరు జిల్లా.

డైమండ్ బాబుపై విచారణ చేపట్టండి: శివనాయక్

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేబుల్ టీవీ ఆర్థిక నేరగాడు, ఇటీవల వైసీపీ గుంటూరు నగర అధ్యక్షుడిగా నియమితుడైన డైమండ్ బాబుపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని టీడీపీ ఎస్టీ సెల్ నాయకుడు శివ నాయక్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో గుంటూరు నగరంలో సిటీ కేబుల్ వైర్లు కట్ చేసి, ప్రజలను ప్రైవేటు కేబుల్ కలెక్షన్లు పెట్టించుకోవాలని హుకుం జారీ చేసి నగర ప్రజలకు దాదాపు పది రోజులపాటు కేబుల్ అంతరాయాలు కలుగజేసి పైశాచిక ఆనందం పొందిన నేరగాడిపై విచారణ జరపాలని కోరారు. వైసీపీ కార్పొరేటర్‌గా ఎన్నికై, ఆ తరువాత డిప్యూటీ మేయర్‌గా ఎంపికైన అతడి ఆఫీసు మల్లికార్జునపేట ఐదో లైన్‌లో ఆక్రమణేనని, నగరపాలక సంస్థ అధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రోడ్లకు మహర్దశ: దేగల ప్రభాకర్



గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో రోడ్లకు మహర్దశ వచ్చిందని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను మ్యాపులో చూసి కాకుండా గుంతల రోడ్లు చూసి గుర్తించే స్థాయికి రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చారని మండిపడ్డారు. గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా ఈ రోజు రోడ్ల గుంతలు పూడ్చుకునే స్థాయికి దిగజారాల్సి వచ్చిందని అన్నారు. సాక్షి ప్రకటనలకు ఖర్చు పెట్టిన రూ.300 కోట్లు కూడా జగన్ ప్రభుత్వం కనీసం రోడ్ల కోసం ఖర్చు పెట్టలేదని ఆరోపించారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు వంద శాతం నెరవేరుస్తున్నారని అన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించండి

● హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్ యాదవ్

గుంటూరు(విద్య),నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగులు, న్యాయవాదులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, సహకారంతో పోటీ చేస్తున్నట్లు స్వతంత్ర అభ్యర్థి, హైకోర్టు న్యాయవాది, గుమ్మా శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. పొన్నూరు రోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమి శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ చదివిన వారు ప్రతి సంవత్సరం పెరిగి పోతూ ఉండడం, వారికి ఉపాధి మార్గాలు లేక, ఉపాధికి సంబంధించిన నైపుణ్య శిక్షణ కూడా సరిగా లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలిప్రాధాన్య ఓటు వేసి తనను గెలిపించాని కోరారు



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం సుజాత

టెన్నిస్‌లో సత్తాచాటిన నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థి

గుంటూరు(విద్య),నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కాకినాడలో నిర్వహించిన అంతర్ జిల్లాల టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థాని భారత్‌పేటలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ విషయాన్ని హెచ్‌ఎం జే సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కే విన్సెంట్ ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు.

ఎన్‌సీసీ లిమిటెడ్‌లో భారీ అగ్నిప్రమాదం

గుంటూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని బొంతపాడు సమీపంలోని ఎన్‌సీసీ లిమిటెడ్‌లో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎన్ సీసీ లిమిటెడ్‌కి చెందిన ఎలక్ట్రికల్ మెటీరియల్ పూర్తిగా దగ్ధమైంది. ఎలక్ట్రికల్ మెటీరియల్ స్టోర్‌లో సంభవించిన షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో ఏఏ ఏసీ కండక్టర్‌తో పాటు, ఎల్టీ డిస్ట్రిబ్యూషన్స్ పూర్తిగా దగ్ధమయ్యాయి. జిల్లా అగ్ని మాపక అధికారి ఎం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిసింది.

తిరిగి ఆక్రమణలు జరగకుండా పర్యవేక్షించాలి

● జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు
● అమరావతి రోడ్డులో ఆక్రమణల తొలగింపు పరిశీలన



అమరావతి రోడ్డులో ఆక్రమణ తొలగింపుపై స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరగకుండా పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక లాడ్జి సెంటర్ నుండి హోసన్నా మందిరం వరకు డ్రెయిన్‌పై, రోడ్డుపై ఉన్న ఆక్రమణల తొలగింపును శనివారం ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆక్రమణలను దశలవారీగా తొలగిస్తామని, అమరావతి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగిస్తున్నట్లు చెప్పారు. వెంటనే పూడిక కూడా తీయాలని పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఓల్డ్ క్లబ్ రోడ్, పట్నం బజార్, జీటీ రోడ్, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించిన విషయాన్ని ప్రస్తావించారు. పర్యటనలో డీఈఈ రమేష్‌బాబు, టీపీఎస్ సత్యనారాయణ, ఏఈ చైతన్య పాల్గొన్నారు.

ఇతర విధుల్లో పారిశుధ్య కార్మికులకు వారి విధులు కేటాయించాలి

ప్రజారోగ్య కార్మికులు పారిశుధ్య పనులు కాకుండా ఇతర విధుల్లో ఉంటే తక్షణం వారిని ఆయా శానిటరీ డివిజన్లలో పారిశుధ్య విధులు కేటాయించాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీని వాసులు ఆదేశించారు. స్థానిక నాజ్ సెంటర్, నల్లచెరువు మస్టర్ పాయింట్లను ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ తొలుత కార్మికుల, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజారోగ్య కార్మికులు పారిశుధ్య పనులు కాకుండా ఇతర విధుల్లో ఉంటున్నారని, అటువంటి వారిని తక్షణం ఆయా డివిజన్లలో పారిశుధ్య విధులు కేటాయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.

శానిటరీ డివిజన్ల వారీగా గార్బేజ్‌ని నూరు శాతం డంపింగ్ యార్డుకి తరలించాలని, అవసరమైతే అదనపు ట్రాకర్లను తీసుకోవాలన్నారు. అనంతరం నల్లచెరువు రిజర్వాయర్‌లోని తాగునీటిలో క్లోరిన్ శాంపిల్ పరిశీలించారు. ప్రతిరోజూ తాగునీటి సరఫరా సమయాల్లో రిజర్వాయర్, సరఫరా జరిగే ఇళ్ల వద్ద శాంపిల్స్ సేకరించాలన్నారు. జీఎంసీ రిజర్వాయర్ల నుండి ప్రైవేట్ ట్యాంకర్లకు నీటిని సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. పర్యటనలో శానిటేషన్ ప్రత్యేక అధికారులు డి.శ్రీనివాసరావు,టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఎస్. ఆయూబ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అంగడి వెంకటేశ్వరరావు, దాసరి ఏడుకొండలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు దరఖాస్తుల పరిశీలన

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కుం టున్న ఓటర్ల క్లెయిమ్స్‌ని క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్‌ఓలు ఆదివారం నుండి వస్తారని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు బీఎల్‌ఓకి తమ చిరునామా, విద్యార్హత వంటి అవసరమైన పత్రాలు అందించి సహకరించాలని కోరారు. బీఎల్‌ఓలకు సమగ్ర వివరాలు అందించ కుంటే సదరు దరఖాస్తును తిరస్కరించే అవకాశం ఉందని తెలిపారు.

ముగ్గురు ఏఈలు, నలుగురు వార్డు అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీస్

ప్రజలకు ప్రభుత్వ సేవలను నిర్దేశిత గడువులోగా అందించడంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలు తీసుకుంటామని, తాగునీటి ట్యాప్ కనెక్షన్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై ముగ్గురు ఏఈలు, నలుగురు వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీలను ఎస్ఎల్ఏ లోపు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం వహిం చిన ఏఈలు పి.వెంకటేశ్వరరావు, కె.సాంబశివరావు, బి.చైతన్యకు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులు వి.రాంబాబు నాయక్, ఎస్.నాగరాజు, ఏ.వెంకటేశ్వర్లు, ఎన్.వేణుగోపాల్ రావులకు క్రమశిక్షణ చర్యలు, పెనాల్టి విధింపు ఎందుకు చేపట్టకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. వివరణ సంతృప్తిగా లేకుంటే విధుల నుండి సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడ బోమని పేర్కొన్నారు.



పశ్చిమ నియోజకవర్గంలో రోడ్లపై గుంతలను పూడుస్తున్న ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు

రోడ్ల నిర్వహణ గాలికి వదిలేశారు

● గత వైసీపీ పాలకులపై ఎమ్మెల్యే మాధవి ధ్వజం

గుంటూరు(కార్పొరేషన్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసిందని ఎమ్మెల్యే మాధవి విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన గుంతలు పూడ్చే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గుంతల రోడ్లపై ప్రయాణిస్తూ పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం నిధుల లేమి ఉన్నా గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపడుతుందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో రూ.38 లక్షలు పైగా వెచ్చించి గుంతలు పూడుస్తున్నట్లు తెలిపారు. జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని 50 కిమీ మేర ఉన్న రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. గుర్తించిన మూడు వేల పాట్ హోల్స్ పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్‌ను తయారు చేశామన్నారు. ఈ కార్యక్రమాలలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, ఈఈ విశ్వేశ్వరరెడ్డి, డీఈ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే హెల్త్ ప్యాకేజీ లక్ష్యం: గళ్లా రామచంద్రరావు



హెల్త్ ప్యాకేజీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, రాంచంద్రరావు

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వికాస్ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఉద్యోగం ఉపాధి కల్పన, అతి తక్కువ ధరకే హెల్త్ ప్యాకేజీలు అందిచాలని నిర్ణయించినట్లు హాస్పిటల్ సీఎండీ రామ చంద్రరావు తెలిపారు. వికాస్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్లు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ సుధాకర్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ నిహారిక, డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ శివరంజిత్ మాట్లాడుతూ రాయితీతో కూడిన ప్యాకేజీలను పేషెంట్లకు అందుబాటులో ఉంచామని అన్నారు. సుమారు రూ. 20 వేల విలువ గలిగిన యాంజియోగ్రామ్‌తో కూడిన కార్డియాక్ ప్యాకేజీ రూ.4,999, వ్యాస్కులర్ సర్జన్ కన్సల్టేషన్‌తో పాటుగా కలర్ డాప్లర్ పరీక్షను రూ.499కే అందిస్తున్నట్లు చెప్పారు. గైనకాలజీ విభాగంలో నార్మల్ డెలివరీ రూ. 10 వేలకు, ఎల్ఎస్‌సీఎస్ రూ. 25 వేలకు, హిస్టెక్టమి రూ.25 వేలకు, పెయిన్ లెస్ డెలివరీ రూ.30 వేలకు అతి తక్కువ ధరలకు అందిస్తున్నామని సంస్థ సీఈవో మూర్తి సాతులూరి తెలిపారు. ప్యాకేజీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే మాధవి దంపతులు ఆవిష్కరించారు. గ్రామాల్లో, వైద్య సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో తమ సంస్థలను స్థాపించి ఇప్పుడున్న 100 బెడ్ల సంఖ్యను 500 బెడ్లకు పెంచుతామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు, శ్రీ భ్రమర డైరెక్టర్లు శ్రేయోభిలాషులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో 'సూపర్ సిక్స్' వెలుగులు

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితాల్లో సూపర్ సిక్స్ పథకాలు వెలుగులు నింపుతాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక 29వ డివిజన్ రామిరెడ్డినగర్ మెయిన్ రోడ్డులో దీపం-2 పథకం లబ్ధిదారులకు శనివారం ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలు ఎన్నో రకాలుగా ఇబ్బం దులు పడ్డారని గుర్తుచేశారు. మహిళా పక్షపాతి అయిన కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోవెలమూడి రవీంద్ర, సింహాద్రి కనకాచారి, మహబూబ్ సుభాని, అమృతరావు, మల్లె ఈశ్వరావు, రాం ప్రసాద్, ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, అడక శ్రీనివాస్, దాసరి జ్యోతి, మామిడి రామారావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కీచక వైసీపీ నాయకులపై కఠినంగా వ్యవహరించాలి: దయారత్నం

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నాటి జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నేత గుడిమెట్ల దయారత్నం విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధి కారాన్ని అడ్డం పెట్టుకుని పదవులు, కాంట్రాక్టులు ఇప్పిస్తామంటూ వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఒక మహిళ దగ్గర రూ.90 లక్షలు తీసుకొని ఇవ్వకపోగా, లైంగికంగా లోబర్చుకోవటం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై కీచకులుగా మారిన వైసీపీ నాయకులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి శిక్షించాలని అన్నారు. సమావేశంలో బొల్లెద్దుల సుశీలరావు, బత్తుల భాస్కర్, రాజేష్ బాబు, ఎర్రగుంట్ల ఆనంద్, బీసీ సెల్ నాయ కుడు గుంటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'ల్యాంప్' సేవలు స్ఫూర్తిదాయకం



విద్యార్థులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న విజయరాణి, సాల్మన్‌పాల్ తదితరులు

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల చదువుల కోసం, కుటుంబ అవసరాల కోసం ల్యాంప్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని బుద్ధా కిడ్స్ డైరెక్టర్ విజయరాణి అన్నారు. స్థానిక చుట్టుగుంట సమీపంలోని జోసెఫ్‌నగర్, కొండా వెంకటప్పయ్య కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అనాథ, దివ్యాంగ బాల బాలికలకు న్యూట్రిషన్ సపోర్ట్ కార్యక్రమంలో ఆమె పాల్గొ న్నారు. అనంతరం ఆమె మాట్లా డుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, ల్యాంప్ సంస్థ సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. బియ్యం, కందిపప్పు, వంటనూనె, బెల్లం, శెనగగుళ్ళు, సబ్బులు మొదలైన నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు దేవపాల్, ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్, ల్యాంప్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరావు, సంస్థ ఆఫీసు మేనేజర్ బాజీ పాల్గొన్నారు.

రక్తదాత ఉమామహేశ్వరరావుకు రేపు అభినందన సభ

గుంటూరు మెడికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత న లభై ఏళ్లుగా రక్తదానం చేస్తున్న పోలిరెడ్డి ఉమామహేశ్వరరావును తమ సంస్థ తరఫున 'జీవిత సాఫల్యత' పురస్కారం అందజేయనున్నట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పావులూరి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న సాయంత్రం ఆరు గంటలకు స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణలోని అన్నమయ్య కళాక్షేత్రంలో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ సేవా సంస్థ రక్తదాన విభాగపు బ్రాండ్ అంబాసిడర్‌గా ఆయనను నియమించ నున్నట్లు వివరించారు.

బావను చంపిన బావమరిది

● తొలుత అనుమానాస్పదమృతిగా కేసు నమోదు
● విచారణలో హత్యగా వెల్లడి ● నిందితుడు అరెస్ట్

గుంటూరు,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై తన చెల్లెలిని వేధింపులకు గురిచేస్తున్నాడనే కోపంతో బావను మందలించేందుకు ప్రయత్నించిన క్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో బావను బావమరిది హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటన స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా కాలనీ సమీపంలో గల జానీ కాలనీలో చోటుచేసుకుంది తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినప్పటికీ దర్యాప్తులో హత్యగా తేలడంతో నిందితుడైన బావమరిదిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జానీ కాలనీకి చెందిన వెంకటరమణ ఆటో డ్రైవర్. తెనాలికి చెందిన స్వాతికి పదిహేనేళ్ల క్రితం వివాహం జరిగింది. వెంకటరమణకు స్వాతి మూడో భార్య వారికి ఇద్దరు కుమార్తెలు. మద్యానికి బానిసైన వెంకటరమణ నిత్యం స్వాతిని వేధింపులకు గురి చేసేవాడు. స్వాతి తమ్ముడు శివకుమార్ తెనాలిలో ఉంటాడు. అతను కూడా ఆటో డ్రైవరే. ఇది ఇలా ఉంటే కొన్ని నెలలుగా స్వాతి తల్లిదండ్రులు కూడా జానీ కాలనీ సమీపంలోనే ఇల్లు తీసుకుని ఉంటున్నారు. గత నెల 24న స్వాతిని వెంకటరమణ కొట్టాడు. దీంతో తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళింది. ఇటీవల కాలంలో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో బ్యూటీ పార్లర్ తో పాటు ఫ్యాన్సీ షాపును స్వాతి నిర్వహిస్తోంది. ఇదిలా ఉంటే గత నెలలో స్వాతి అత్తమామలు ఆ షాపు వద్దకు వచ్చి కాపురానికి రావాలని, తమ్ముడుకు చెబితే వెంకటరమణను బెదిరిస్తాడని, దీంతో అంతా సర్దుకుంటుందని చెప్పారు. అత్తమామలు చెప్పినట్లుగానే స్వాతి తన సోదరుడు శివకుమార్‌కు ఈ విషయం చెప్పింది. గత నెల 25న జానీ కాలనీలోని ఇంటికి అతను వెళ్ళాడు. ఆ సమయంలో వెంకటరమణ ఒకడే ఇంట్లో ఉన్నాడు. దీంతో తన చెల్లెలిని ఇబ్బంది పెడుతున్న విషయంపై శివకుమార్ తన బావను బెదిరించాడు. ఈ విషయమై వారి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన శివకుమార్ బావ వెంకటరమణపై చేయి చేసుకోవడమేగాక అతని గొంతు నులిమి చంపేశాడు. అనంతరం అతన్ని అక్కడే పడుకోబెట్టి వెళ్ళిపోయాడు. కాగా, ఈ ఘటనపై వెంకటరమణ తల్లిదండ్రులు, బంధువులకు అనుమానం కలిగినప్పటికీ మద్యమధ్యలో భార్యను వేధిస్తున్న కారణాలతో వారు కూడా బయటికి చెప్పకుండా ఉండిపోయారు. అయితే, వెంకటరమణ బావమరిదికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసుల ఆదేశాలతో వెంకటరమణ భార్య స్వాతి ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అక్కడ వెంకటరమణ గొంతుపై గాయాలతో పాటు చంపినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. దీంతో, పోలీసులు అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చారు. అనంతరం నిందితుడు శివకుమారుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

సమాధుల తోటలో ప్రత్యేక పూజలు

గుంటూరు నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేథలిక్ క్రైస్తవులు జరుపుకునే ఆత్మల పండుగ శనివారం జిల్లా వ్యాప్తంగా అత్యంత ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సమాధుల తోటల్లో క్యాథలిక్ క్రైస్తవులు ఆయా సమాధులను శుభ్రం చేసి పూలతో అందంగా అలంకరించి, క్యాండిల్స్ వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హద్దు మీరితే పీడీ చట్టం.. లేదంటే నగర బహిష్కరణ

● రౌడీషీటర్లను ఉపేక్షించం
● కోర్టు కానిస్టేబుళ్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు ● సమీక్షలో ఎస్పీ సతీష్ కుమార్



గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ రౌడీయిజం చేస్తున్న రౌడీషీటర్లను ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని కోర్టులలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు, సంబంధిత పోలీస్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో జిల్లాలో రౌడీషీటర్ల కార్యకలాపాలు కలకలం రేపుతుండటం, ప్రజల్లో భయాందోళన కలిగిస్తుండడం, అదే సమయంలో కోర్టు కానిస్టేబుళ్లు రౌడీషీటర్లు,సంఘవిద్రోహశక్తులతో చేతులు కలిపి చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఘటనల నేపథ్యంలో ఎస్పీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల తెనాలి, గుంటూరులోని అరండల్ పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు రెచ్చిపోయిన ఘటనలతో పాటు పట్టాభిపురం కోర్టు కానిస్టేబుల్ వైసీపీ నేత పేరు కలిగిన రౌడీ షీటర్ కు ఆయన డెత్ సర్టిఫికెట్ కోర్టులో అందజేసి ఆయా కేసులను రద్దు చేయించిన నేపథ్యంలో ఎస్పీ సీరియస్‌గా స్పందించారు. కోర్టు కానిస్టేబుళ్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, రౌడీ షీటర్లు, సంఘవిద్రోహ శక్తులతో చేతులు కలిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్ల వారీగా రౌడీషీటర్లకు సంబంధించిన సమాచారం సేకరించినట్లు స్పష్టం చేశారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 150 మంది రౌడీషీటర్లు చురుగ్గా రౌడీ కార్యకలాపాల్లో ఉంటున్నట్లు గుర్తించినట్లు స్పష్టం చేశారు. ముందుగా గుర్తించిన ఈ రౌడీషీటర్లకు సంబంధించిన కేసులు త్వరితగతిన ట్రయల్ పూర్తి చేసుకునే విధంగా, అలాగే పకడ్బందీగా ఆధారాలు సేకరించి వారికి శిక్షలు పడేవిధంగా చర్యలు తీసు కోవాలని కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ ఆదేశించారు. రౌడీ షీటర్లకు, గంజాయి కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేవిధంగా కృషి చేయాలన్నారు. ఇప్పటికే గుర్తించిన 150 మంది రౌడీషీటర్ల కేసులు త్వరగా ట్రయల్ పూర్తయ్యేలా చూడటంతో పాటు వారిపై పీడీ చట్టాన్ని లేదంటే నగర బహిష్కరణను అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. సమావేశంలో డీసీ ఆర్‌బీ సీఐ నరసింహారావు, ఐటీ కోర్ సీఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

6న కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

గుంటూరు(విద్య),నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, జీవో నంబర్ 77ను వెంటనే రద్దు చేయాని కోరూతూ ఈ నెల 6న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ఎస్ఎఫ్ఐ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి యశ్వంత్, ఉదయరాజు, గోపి పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ అనురాగ్ పోలవరపు

గుండె కవాటాల మార్పిడిలో ఆధునిక వైద్యచికిత్సలు

● కార్డియాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ వెల్లడి

గుంటూరు మెడికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టైప్-2 షుగర్, గుండె జబ్బులు ఉన్న రోగులకు డయాబెటిక్ ఔషధమైన సెమాగ్లుటైడ్ వాడటం వల్ల గుండెపోటు, పక్షవాతం రిస్క్ బాగా తగ్గుతున్నట్లు సోల్ ఫేజ్-3 డ్రగ్ ట్రయిల్‌లో వెల్లడైనట్లు లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌కు చెందిన ఎండోవ్యాస్క్యులర్ ఇంటర్వెన్షన్స్ విభాగం డైరెక్టర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ పోలవరపు అనురాగ్ తెలిపారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో అక్టోబరు 27 నుంచి 30వ తేదీ వరకు జరిగిన ట్రాన్స్ కెథెడర్ కార్డియోవ్యాస్క్యులర్ థెరప్యూటిక్స్-2024 వైజ్ఞానిక సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాగ్ పోలవరపు, ఛాలెంజింగ్ ఇంటర్వెన్షన్ ఇన్ ఏ కేస్ ఆఫ్ లెఫ్ట్ హ్యాండ్-ఎక్యూట్ లింబ్ ఇస్కీ మియా,- ఆర్టరీ ఇన్ ది షాడోస్' అనే అంశంపై మాట్లాడారు. ట్రాన్స్ కెథటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్, ట్రాన్స్ కెథడర్ ట్రైకస్పిడ్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ వంటి సరికొత్త సాంకేతిక చికిత్సలపై కూడా సదస్సులో చర్చించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదులో సమస్యలు తొలగించండి

గుంటూరు(విద్య),నవంబరు 2(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయి అధికారుల బాధ్యతా రాహిత్యం వల్ల ఎమ్మెల్సీ ఓట్లు నమోదులో సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు టీ ఆదిలక్ష్మి, ఎం కళాధర్ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం డీఆర్‌వో ఎస్ఎస్‌కె ఖాజావలిని కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధనల ప్రకారం నమోదు ప్రక్రియ జరిగేలా చూడాలని కోరారు. ఓపెన్ డిగ్రీ, అటెస్టేషన్ సర్టిఫికెట్స్‌పై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యూటీఎఫ్ నాయకులు ఎం హనుమంతరావు, జీ వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, జీ వెంకటశ్వరరావు, ఎం గోవిందు, జేవీవీ నాయకులు బీ ప్రసాద్ పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ శిక్షణ సద్వినియోగం చేసుకోండి: డీఈవో



శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న డీఈవో సీవీ రేణుక తదితరులు

గుంటూరు(విద్య),నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. పదవ తరగతి విద్యార్థులకు విజ్ఞాన్ యూనివర్సిటీ సహకారంతో స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి,విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దుర్గ,పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఎండీ ఖాసిం, సమగ్రశిక్ష ఏఎల్ఎస్ సీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవినీతి, కల్తీ, పన్నులపై విజిలెన్స్ అవగాహన ర్యాలీ

గుంటూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):అవినీతి,కల్తీ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. విజిలెన్స్ ప్రాంతీయ నిఘా, అమలు అధికారి డీసూర్య శ్రావణకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రగతి పాఠశాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ పూజిత స్కూలు విద్యార్థులతో స్థానిక పట్టాభిపురం మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ పార్కులలో, క్రీడా ప్రాంగణాలలో కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో రూరల్ వాటర్ వర్క్స్ ఎస్ఈ కల్యాణ్ చక్రవర్తి, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య,విజిలెన్స్ డీఈఈ అల్లాడి శ్రీనివాస్,సీఐలు కొమ్మలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ వాక్ థాన్

గుంటూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని గుంటూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం వాక్ దాన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయం ,స్థానిక శాఖల నుండి సుమారు 200 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఛైర్మన్ కె.ప్రమోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థాగత, వ్యక్తిగత స్థాయిలలో విశ్వసనీయత, సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి బ్యాంక్ ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. వాక్‌థాన్‌లో జనరల్ మేనేజర్ పి.మారుతీరామ్, విజిలెన్స్ ఇంచార్జి ఈ రాంబాబు, విజిలెన్స్ అధికారి ఎన్‌వీ విజయ్ కుమార్, గుంటూరు రీజనల్ మేనేజర్ సీహెచ్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేసిన విద్యుత్ ఉద్యోగులు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు ప్రజలంతా భాగస్వాములు కావాలని విద్యుత్‌శాఖ మంత్రి ఓఎస్‌డీ ఏపీ సాంబశివరావు పిలుపు నిచ్చారు. స్థానిక సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యుత్ ఆపరేషన్ ఎస్‌ఈ కేపీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులతో అవినీతి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, శ్రీనివాసరావు, సీహెచ్‌వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడుగుపెడుతూనే కొత్త ప్రపంచం

- రెస్టారెంట్ ఆన్ వీల్స్
- రైల్వే కోచ్ రెస్టారెంట్లకు పెరుగుతున్న ఆదరణ

రెస్టారెంట్లలో కొత్తదనాన్ని కోరుకుంటున్న వారు వింతైన అనుభూతిని పొందాలనుకుంటున్నారా! అయితే, రెస్టారెంట్ ఆన్ వీల్స్‌గా పిలవబడే రైలు కోచ్ రెస్టారెంట్లకు వెళ్లాల్సిందే. లోపలికి అడుగు పెడుతూనే శీతలమైన రూం టెంప రేచర్, కళ్లు మిరుమిట్లు గొలిపే ఇంటీరియర్స్, లైటింగ్స్, ఆరోగ్యకరమైన వాతావరణం మదిని దోచేస్తుంటాయి. ఇక రైలు బోగీలో ప్రయాణిస్తూ ప్రీతిపాత్రమైన వంట కాలను ఆరగిస్తుంటే 'ఆహా! ఆ మజానే వేరు' అని కుర్ర కారు అంటున్నారు. గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు, పశ్చిమ వైపున ఉన్న రైలు కోచ్ రెస్టారెంట్లు విశేషంగా ఆకర్షించడమే కాదు రోజురోజుకు ఆదరణని పెంచు కుంటున్నాయి. 24 గంటలు వారంలో ఏడు రోజులు సేవ లందించే రెస్టారెంట్లు కావడం వీటికి ప్లస్ పాయింట్. అర్ధరాత్రి అయినా అపరాత్రి అయినా వెళ్లి ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ చేసి లాగించేయొచ్చు.

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గతంలో పాతబడిన భారీ పడవలను సముద్ర తీరానికి తీసుకొచ్చి వాటిని సందర్శన ప్రదేశంగా చేసేవారు. ఆ తర్వాత విమానాల వంతు వచ్చింది. విమానాన్ని రెస్టారెంట్‌గా మార్చారు. ఈ నేపథ్యంలో రైల్వేలో ఫుడ్ కాంట్రాక్టర్‌గా ఉన్న కోటిరెడ్డి అనే వ్యక్తి వీటి అనుభవం ద్వారా పాడుబడిన రైలు బోగీని రెస్టారెంట్‌గా ఎందుకు చేయకూడదని ఆలోచన చేశారు. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా అప్పటి గుంటూరు డీఆర్‌ఎం మోహన్‌రాజాని సంప్రదించి తన ప్రణాళికను వివరించారు. అప్పటికే గుంటూరు రైల్వే డివిజన్‌లో శిథిలావస్థ స్థితికి చేరుకొన్న ఓ రైలు బోగీ ఉండటం, దాని ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో డీఆర్‌ఎం అంగీకరించారు. కోచ్ ఓవర్ హాలింగ్ డిపో నుంచి ఆ బోగీని తెప్పించి తొలుత గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపున అటు రైలు ప్రయాణికులు, ఇటు బయటి ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేయించారు.



కోచ్ రెస్టారెంట్ వెలుపల ఫుడ్ ఎక్స్‌ప్రెస్

దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా కాంట్రాక్టర్ కోటిరెడ్డి రైలు బోగీని అందంగా తీర్చిదిద్దారు. విలాసవంతంగా ఉండేలా మెరుగులు అద్దించారు. ఇందుకోసం ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా రూ.50 లక్షలు వెచ్చించారు. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఏమిటన్న విమర్శలు ఆ సందర్భంలో లేకపోలేదు. అయినప్పటికీ ఆయన ముందుకెళ్లడంతో కోచ్ రెస్టారెంట్ అనతి కాలం లోనే రూపుదిద్దుకొంది. ఒకేసారి 50 మందికి పైగా కూర్చునేలా సీటింగ్‌ని తీర్చిదిద్దారు. ప్రతీ ఓపెన్ కంపార్టుమెంట్ వద్ద నలుగురు కూర్చుని కబుర్లు చెప్పు కొంటూ ఫుడ్ ఆర్డర్ చేసి లాగించేయొచ్చు. ప్రతీ కంపార్టుమెంట్‌కు ఎదురుగా అద్దంతో కూడిన కిటికీ వచ్చేలా డిజైన్ చేశారు. దీని వలన రైలులో ప్రయాణిస్తూ భోజనం చేస్తున్న అనుభూతి కలుగుతుంది.

రూ. 50 లక్షలతో ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్‌ల అభివృద్ధి


కోచ్ రెస్టారెంట్ లోపలి భాగం


వంటకాలు ఆరగిస్తున్న కస్టమర్లు



రైల్వే కోచ్ రెస్టారెంట్

అన్ని ప్రాంతాల ప్రయాణికులు ఇష్టపడే వంటకాలు

రైల్వేస్టేషన్ అనగానే ఒక గుంటూరు జిల్లాకు చెందిన ప్రయాణికులే రారు. దేశం నలుమూలల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఫుడ్ మెనూని రూపొందించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రింతా వెజ్, నాన్‌వెజ్ వంటకాలు వేడివేడిగా వడ్డిస్తుంటారు. నార్త్ ఇండియన్స్ ఇష్టపడే వంటకాలు కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ఇక అన్నిరకాల బెవరేజస్‌ని అందు బాటులో ఉంచారు. తాజా పండ్ల రసాలు, చైనీస్ ఫుడ్ ఐటెమ్స్ కూడా ఆర్డర్ చేసిన కొద్దిసేపటికే తీసుకొచ్చి సర్వ్ చేస్తున్నారు. రేట్లు కూడా సాధారణ రెస్టారెంట్లలో మాదిరే ఉన్నాయి.

రైల్వేస్టేషన్ పశ్చిమ వైపునే డిమాండ్ పెరగాలి

రైల్వేస్టేషన్ తూర్పు వైపున ఏర్పాటు చేసిన కోచ్ రెస్టారెంట్‌కు 24 గంటలు జనాదరణ ఉంటోంది. ఈ ఏడాది ఎన్నికలకు ముందు వెస్ట్ టెర్మినల్ వైపున ఏర్పాటు చేసిన కోచ్ రెస్టారెంట్‌కు ఇంకా డిమాండ్ పెర గాల్సి ఉంది. వెస్ట్ టెర్మినల్ ఇంకా అధికారికంగా ఓపెన్ కాకపోవడం, ఎక్కువ రైళ్లు ఒకటో నంబరు ప్లాట్‌ఫాంకే తీసుకొంటుండటంతో ప్రయాణికుల రద్దీ అటు వైపునే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో వెస్ట్ టెర్మినల్ త్వరగా ప్రారంభించి కొన్ని ముఖ్యమైన రైళ్లను ఏడో నెంబరు ప్లాట్‌ఫాంకు తీసుకుంటే ఇటువైపున కూడా రాకపోకలు పెరిగి.. వెస్ట్ సైడ్ కోచ్ రెస్టారెంట్‌కు ఆదరణ పెరిగే అవకాశం ఉంటుంది. అలాగా, ఈస్ట్ సైడ్ రెస్టారెంట్‌కు ఉన్నంత పబ్లిక్ యాక్సెస్ వెస్ట్ సైడ్ లేక పోవడం కూడా దీనికి కొంత ప్రతికూలంగా మారింది.

పోలీసుల భయం ఉండదు

సాధారణంగా గుంటూరు నగరంలో ఏ రెస్టారెంట్ అయినా రాత్రి 10 నుంచి 11 గంటల మధ్య మూసేయాలి. ఆ తర్వాత తెరిచి ఉంచితే పోలీసులు సైరన్ వేసుకొంటూ వచ్చి చర్యలు తీసుకొంటారు. దీని వలన అటు రెస్టారెంట్ల నిర్వాహకులు, ఇటు వినియోగ దారులకు ఇబ్బందికరం. కాగా, రైల్వే కోచ్ రెస్టారెంట్ల వద్ద అలాంటి భయం ఉండదు. ఇందుకు కారణం ఈ రెస్టారెంట్లకు 24 గంటల అనుమతి ఉంది. వీటికి పార్కింగ్ ప్రదేశాలు కూడా ఉన్నాయి. దీని వలన వాహనాలు చోరీకి గురవుతాయనే భయం ఉండదు.



బాలకుటీర్ నిర్వహించే లలితా కళా పోటీలకు ఆహ్వానం

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): లలిత కళలను ప్రోత్సహించటం కోసం సంస్థ వ్యవస్థాపకులలో ఒకరైన గరిగె ప్రభావతి స్మృతి దినోత్సవం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ 29 ఏళ్ళుగా డిసెంబరు 10వ తేదీన లలిత కళ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ నన్నపనేని మంగాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ లలిత కళల్లో ప్రతిభావంతులైన బాలలకు 'ప్రతిభా పల్లవం' పురస్కారాన్ని, బాల సాహితీ సృజనకర్తలకు 'మంగాదేవి బాల సాహిత్య పురస్కారాన్ని' సాహిత్య రంగానికి విశేష సేవలందిస్తున్న మహిళలకు మాలతీ ప్రమదా సాహితీ పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తున్నట్లు చెప్పారు. బాలల సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించటానికి రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులను, గురువులను ఆయా పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించా ల్సిందిగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డాక్టర్ మంగాదేవి విజ్ఞప్తి చేశారు. పోటీలు గాత్రం, వాద్య సంగీతంలో వ్యక్తిగతంగాను, బృంద గానాల రూపంలోనూ ఉంటాయని, వాటితో పాటు చిత్రలేఖనం, కథా రచన, లేఖా రచనలలో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. ఉత్తమస్థానాల్లో నిలిచిన బృందాలకు బహుమతుల కింద ఒక్కొక్క బృందానికి రూ. 5వేలు, రూ. 4వేలు, రూ. 3వేలు, గురువులకు రూ.4వేలు, రూ. 3వేలు, రూ. 2 వేలు బహుమతులు ఉంటాయన్నారు. పోటీదారులు ఆన్‌లైన్‌లో మాత్రమే రిజిష్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నవంబరు 18 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు నిర్వహించే పోటీల వివరాలను శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్, మూడో లైను, శ్యామలానగర్, గుంటూరు (0863-2232405, 9390115480, 7729967589, 8121590409) లో సంప్రదించాలని కోరారు. రిజిస్ట్రేషన్ ఫారం స్కూల్ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్‌వీబీకే. ఇన్ లేదా సర్క్యులర్‌లో ఇచ్చిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి పొందవచ్చని తెలిపారు.

అండర్ - 19 ఫుట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక


అండర్ - 19 ఫుట్‌బాల్ బాల బాలికల జట్లు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాల బాలికల ఫుట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు మండలంలోని నందిగామ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం జరిగాయి. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 110 మంది క్రీడాకారులు హాజరైనట్టు అండర్ - 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జీ నరసింహారావు తెలిపారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సత్తెనపల్లిలో జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని ఆయన తెలిపారు. బాలుర జట్టు డీ సాయి కుమార్, ఎం ముఖేష్, వై కార్తీక్, వీ విల్ స్మిత్, ఏ గోపీ సందీప్, జే మోజెష్, ఏ స్టాలిన్, ఏ ఫైజక్, ఎస్ రేవంత్, జీ గిరి ప్రతాప్, పీ యాసిన్ ఖాన్, షేక్ ఆరీఫ్, జీ ప్రదీప్, షేక్ ఫరీదు, డీ అనేష్; కే నరేష్, ఎం రిషీ, స్టాండ్‌బైలుగా పీ వేణుగోపాల్, షేక్ ఖాజా మొహిద్దీన్, పీ కిరణ్ కుమార్, ఎం వినయ్ తేజ, షేక్ జుబేర్‌లు ఎంపికయ్యారు. బాలికల జట్టు ఎల్ శివ దుర్గ, కే వెంకట త్రివేణి, జీ శ్రీలక్ష్మి, సీహెచ్ జ్ఞాన శ్రీ అర్చన, వీ అఖిల, కే కారుణ్య, ఓ దీవెన, వీ మౌనిక, టీ యామిని, ఎం నవ్య, ఎం అమ్ములు, ఎం పవిత్ర పావని, కే హేమ రాజేశ్వరి, జీ సౌజన్య డీ కోమలి, ఎం శ్రీలక్ష్మి మహేశ్వరి, కే బ్లెసీ, ఎన్ రమ్య, స్టాండ్ బైలుగా కే రాజ్యలక్ష్మి, ఎన్ షబానా, బీ లావణ్య జీ కుసుమలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, వీ అనీల్ దత్త నాయక్, కే సునీత, యూ సత్యవతి, షేక్ పెద కరిముల్లా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైల్వేలో గుర్తింపు ఎన్నికల సందడి

- డిసెంబరు 4, 5, 6 తేదీల్లో పోలింగ్
- 4,500 మందికి పైగా ఉద్యోగులకు ఓటు హక్కు
- యూనియన్, సంఘ్‌ల పోటాపోటీగా హామీలు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికల సందడి నెలకొన్నది. ఎన్నికల నిర్వహణ తేదీలను రైల్వే శాఖ ఖరారు చేయడంతో గత కొన్ని రోజుల నుంచి మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. చివరిసారిగా 2013లో ఎన్నికలు జరగడం, దశాబ్దం తర్వాత ఎన్నికలు జరగబోతుండటంతో పెద్ద సంఖ్యలో హామీలను గుప్పిస్తున్నాయి. గుర్తింపు సంఘం ఎన్నికల్లో తొలి నుంచి మజ్దూర్ యూనియన్ సత్తా చాటుతూ వచ్చేది. అయితే 2013లో మాత్రం సంఘ్ గెలిచి సంచలనమే సృష్టించింది. ఈ దఫా ఎలాగైనా గెలవాలని మజ్దూర్ యూనియన్, తన పట్టుని మరోసారి నిలుపుకోవాలని ఎంప్లాయిస్ సంఘ్‌లు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. జాతీయ స్థాయి నాయకులను ఆహ్వానించి మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులను వ్యక్తిగతంగా కలుసుకొంటూ మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నాయి.



గుంటూరు రైల్వేస్టేషన్

8వ వేతన సంఘం ఏర్పాటుకు పోరాటం: ఎంవీ ప్రసాద్, డివిజనల్ సెక్రెటరీ



2026 జనవరి 1వ తేదీ నాటికి నివేదికతో 8వ వేతన సంఘం ఏర్పాటు. ఓపెన్ లైన్ డిపార్టుమెంట్ ఉద్యోగు లందరికి రిస్క్, హార్డ్ డ్యూటీ అలవెన్స్. ట్రాక్ మెయిం టెనర్లకు రిస్కు అలవెన్స్ పెంపు, పని భారం తగ్గింపునకు ప్రయత్నం. కీమెన్, మేస్త్రీల కోసం జీపీ 4200. అదనపు 10 శాతం ఎల్‌డీసీఈ అందరికి తెరవడం. ఉద్యోగులం దరికి ద్విచక్ర వాహన భత్యం. అందరికి 8 గంటల పని విధానం. 500 రోజుల వరకు ఆర్జిత సెలవు, పదవీ విరమణ సమయంలో 360 రోజుల ఎన్‌క్యాష్‌మెంట్‌కు మంజూరు ఇప్పించడం. మెడికల్ అలవెన్స్ రూ. 3 వేలు వేసైడ్ స్టేషన్ ఉద్యోగులకు ఇప్పించేందుకు ప్రయత్నం. హెచ్‌ఆర్‌ఏ ఎక్స్ తరగతి నగరాలకు 40 శాతం, వై తరగతి నగరాలకు 30 శాతం, జెడ్ క్లాస్ నగరాలకు 20 శాతం పెంచేలా చూడటం. అన్నిరకాల క్వార్టర్లలో ఒక గది ఎయిర్ కండీషనింగ్ చేయించడం. తల్లిదండ్రులకు పాస్, వైద్య సదుపాయాల కల్పన. రన్నింగ్ సిబ్బందికి వారానికి 46 గంటల విశ్రాంతి. 70 శాతం రన్నింగ్ అలవెన్స్ ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ప్రయత్నం.

ఏకీకృత పెన్షన్ విధానం అమలుకు ఒత్తిడి: రమణయ్య, సంఘ్ డివిజనల్ సెక్రెటరి



రైల్వేలలో నూతన పెన్షన్ విధానాన్ని(ఎన్‌పీఎస్) రద్దు చేస్తూ పాత పింఛన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విధానం(యూపీఎస్) అమలుకు పోరాటం. 8వ పే కమిషన్‌ను త్వరగా ఏర్పాటు చేయించి డాక్టర్ ఆక్రయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనం నెలకు రూ. 32,500 ఇప్పించడం. 2020 జనవరి నుంచి 2021 వరకు నిలిపేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ/డీఆర్ తక్షణం విడుదల చేయించేందుకు పోరాడతాం. పీఎల్ బోనస్‌పై ఉన్న శాలరీ సీలింగ్‌ను తొలగించాలి. రైల్వేలో 12 గంటల డ్యూటీని రద్దు చేసి 8 గంటల విధానాన్ని ప్రవేశపెట్టిస్తాం. రైల్వేలో అన్ని కేటిగిరీలకు గ్రేడ్‌పే రూ. 4600లకు బదులుగా రూ. 4800 అమలు చేసేందుకు ఒత్తిడి చేస్తాం. రైల్వేలో పాయింట్స్‌మెన్ కేటిగిరీకి 4 గ్రేడ్ పే స్ట్రక్చర్ అమలుకు రైల్వేబోర్డుతో మాట్లాడతాం. రైల్వే ఉద్యో గుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య చికిత్స, పాస్ సౌకర్యాల కల్పనకు ప్రయత్నం. ట్రాక్ మెయింటెనర్ల పని గంటలు తగ్గించి భోజన విరామాన్ని డ్యూటీలో భాగంగా పరిగణించాలి. ఎన్‌ఎఫ్‌ఐఆర్ డిమాండ్ నెంబరు. 1/2022 ప్రకారం ఎల్‌డీసీఈని అందరికి వర్తింపు చేయాలి. కనీసం పాతికేళ్ల సర్వీసు పూర్తి చేసుకొన్న మహిళా ఉద్యోగులు వారి పిల్లలకు ఉద్యోగం ఇచ్చే నిబంధనతో స్వచ్ఛంధ ఉద్యోగ విరమణకు అవకాశం కల్పించాలి. ఇలా మరికొన్ని హామీలను సంఘ్ ఇచ్చి ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నది.

క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం

బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చదలవాడ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే అరవింద బాబు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. శనివారం స్థానిక కోడెల శివప్రసాదరావు స్టేడియంలో రాష్ట్ర స్థాయి బాలికల బాస్కెట్‌బాల్ 2024 - 25 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని క్రీడాకారులకు సూచించారు. కేవలం చదువుల మీద దృష్టి పెట్టకుండా పిల్లలను తల్లిదండ్రులు క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. తొలుత ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక, రాజకీయాలను విశ్లేషించిన 'మానవాళికి మహోదయం'

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, పాల్గొన్న రచయిత పాపారావు తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాల కాలంలో ప్రపంచంలో జరిగిన ఆర్థిక, రాజకీయలను విశ్లేషించిన గొప్ప పుస్తకం 'మానవాళికి మహోదయం' అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆర్థిక విశ్లేషకులు డీ పాపారావు రచించిన 'మానవాళికి మహోదయం-అంతం కాదిది ఆరంభం' పుస్తకాన్ని శనివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సభకు గుంటూరు క్లబ్ బుక్ రీడర్స్ అధ్యక్షుడు కాపు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2008లో ఆర్థిక సంక్షోభం అనంతరం నిర్దిష్టంగా వాస్తవ రూపం దాలుస్తున్న పరిణామాలు రచయిత వాదనలకు తార్కాణంగా ఈ పుస్తకం నిలబడిందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ 2024లో మరింత ఉధృతంగా కమ్ముకొస్తున్న మాంద్యం మేఘాలు వంటి అంశాలు ఈ పుస్తక ప్రచురణకు రచయితను ప్రేరేపించాయన్నారు. పుస్తక రచయిత పాపారావు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారి దోపిడీకి గుండెకాయగా, వెన్నుదన్నుగా ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ పునాదులు కదిలిపోతున్నాయన్నారు. సమాధిలోకి సామ్రాజ్యవాదం అనే పుస్తకాన్ని 2012లో రచించానని, దానికి మరింత అదనపు సమాచారం జోడించి 'మానవాళికి మహోదయం' పేరుతో మరో పుస్తకాన్ని విడుదల చేశానన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మల్లికార్జునరావు, సీపీఎం నాయకులు భైరగాని శ్రీనివాసరావు, దండా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకత మొదలు

- దుష్ప్రచారంతోనే వైసీపీ ఓటమి
- వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై నాలుగు నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకత మొదలైందని మాజీ ఎంపీ, వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. వైసీపీ గుంటూరు నగర అధ్యక్షుడుగా డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ప్రమాణ స్వీకారం శనివారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి పార్టీలు చేసిన దుష్ప్రచారంతోనే వైసీపీ ఓటమి పాలైందన్నారు. దేశంలో ఏ సీఎం చేయని విధంగా జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన చేశారన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్ప చర్యలుండటం లేదని విమర్శించారు. ప్రజల పక్షాన కార్యకర్తలు నిరంతరం పోరాడాలన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ఎంతో సమయం లేదని, 2027లోనే ఎన్నికలు ఉండే అవకాశం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ జెండా విజయం సాధించేలా పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలతో వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం ఖాయమన్నారు. మాజీ మంత్రి విడదల రజిని మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అన్నీ మాయమాటలే తప్ప చేతలు లేవని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. మరో మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళ లపై ఇన్ని అఘాయిత్యాలు జరుగు తుంటే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరుఏమైందని విమర్శించారు. నగర అధ్యక్షుడు బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లా డుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సమన్వయకర్తలు అంబటి మురళి (పొన్నూరు), షేక్ నూరి ఫాతిమా(గుంటూరు తూర్పు), ఎలికా శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, వేదికపై ఎంపీ అయోధ్యరామిరెడ్డి, మాజీ మంత్రులు అంబటి, రజని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

నూతన భవన సముదాయానికి రూ 6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ. 6 లక్షలను నగరానికి చెందిన పర్వతనేని వెంకట లక్ష్మీ, పర్వతనేని నాగ మోహన సాయి విరాళంగా ప్రకటించారు.


సామినేని, చుక్కపల్లి రమేష్‌లకు చెక్కును అందజేస్తున్న దాతలు

శనివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్, కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు వారు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాల కవర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, వాసిరెడ్డి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాల్లో శనగలు సిద్ధం

వట్టిచెరుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఎస్‌జీ - 11 పుల్ల శనగలు, కేపీకే - 2 శనగలు సబ్సిడీపై రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఏవో లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరాకు 40 కేజీలు చొప్పున ఐదెకరాల వరకు అందిస్తామని అన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఏఏవోలను సంప్రదించాలని కోరారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ జీవో విడుదల చేయాలి

మంగళగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కే శివదుర్గారావు, పీ బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆగస్టు 7న చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు చేనేతలకు ఉచిత విద్యుత్తు ఇస్తామని హామీ ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఆ ప్రకటన చూసిన చేనేత కార్మికులు దరఖాస్తులను పూర్తిచేసి విద్యుత్ శాఖ కార్యాలయాల్లో అందజేశారని, ఇంతవరకు దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ఆ తరువాత గాంధీ జయంతికి, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవానికి జీవో వస్తుందని ఎదురుచూసిన చేనేత కార్మికులకు నిరాశే మిగిలిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని కోరారు.

బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


తాడిశెట్టి వర్ష

దుగ్గిరాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన వర్ష రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్ శోభారాణి తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించిన ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన తొమ్మిదో తరగతి విద్యార్థిని వర్షను ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ అభినందించింది.

ప్రకృతి వ్యవసాయంతో పంటలకు మేలు

● ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్

గుంటూరు(తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ విధానాలతో పంటకు మేలు జరుగుతుందని ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ ఎన్ వెంకటలక్ష్మి తెలిపారు. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో సమగ్ర పోషక యాజమాన్యం కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తిలో ఆరు వరుసలకు ఒక వరుస కందిని సాగుచేయాలని దీంతో రైతుకు ఆదనపు ఆదాయం సమకూరుతుందని వివరించారు. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త సీహెచ్ నాగలక్ష్మి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సాంకేతికను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సంఘ సభ్యులు వంగా నవీన్‌రెడ్డి, అలవల కోటేశ్వరరావు, ప్రాథమిక సహకార సంఘ ప్రతినిధులు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

6న పసుపుదువ్వ వేలం

దుగ్గిరాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో పసుపు దువ్వ వేలం ఈ నెల 6వతేదీన నిర్వహించనున్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు జరుపనున్న వేలంలో పాల్గొన దలచిన వారు రూ.2వేల దరావత్తు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

మరణాన్ని జయించిన జీసెస్

● బిషప్ చిట్టాబత్తిని భాగ్యయ్య


ఆత్మల పండుగలో మాట్లాడుతున్న గుంటూరు బిషప్ చిట్టాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మరణంను జీసెస్ జయించారని గుంటూరు బిషప్ చిట్టాబత్తిని భాగ్యయ్య అన్నారు. శనివారం ఫిరంగిపురంలోని క్రైస్తవ సమాధుల స్థలంలో జరిగిన దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. విలువల జీవితాన్ని, ఇతరులకు సహాయ సహకారాలు అందించే విధానాలను అవలంబించాలన్నారు. జీవితం శాశ్వతంగా ఉండేలాంటే ప్రార్థనలు, పూజలే ముఖ్యమన్నారు. చనిపోయిన వారు మన మధ్య ఉన్నప్పుడు ఎలా ప్రవర్తించారో వారి స్మృతులను గుర్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. మరణం తప్పదు అన్న సత్యాన్ని మరచి పోయి ఎవ్వరూ జీవించ వద్దన్నారు. ఈ లోకంలో మంచిని కలిగి అందరూ జీవించాలన్నారు. అనంతరం క్రైస్తవ సమాధులను ఆయన ప్రార్థనలు చేసి ఆయన ఆశీర్వదించారు. ముందుగా గ్రామంలోని క్రైస్తవులంతా తమ పూర్వీకుల సమాధులను కొవ్వొత్తులతో అందంగా అలంకరింప చేసి పూలు చల్లి బాణా సంచా పేల్చారు. కార్యక్రమంలో బాల ఏసు చర్చి ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి, ఫాదర్ తోమాస్ తదితర గురువులు, కన్యాస్త్రీలు, గుడి పెద్దలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

వట్టిచెరుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లోని ఆయా ఆలయాల్లో కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. అధిక శాతం మంది మహిళలు తెల్లవారు జామునే మండలంలోని అప్పాపురం ఛానల్, గుంటూరు ఛానల్ పరిసర ప్రాంతాల్లో తెల్లవారుజామున 5 గంటల నుంచి స్నానాలు ఆచరించి ప్రమిదలతో దీపాలు వెలిగించారు. ఇదే సందర్భంలో ఆలయాల్లో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో పూజారి కృష్ణ భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రహదారుల అనుసంధానంతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


రేటూరులో రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

కాకుమాను, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రహదారుల అనుసంధానంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కాకుమాను - పుసులూరు వెళ్లే రహదారి, బాపట్ల - పెదనందిపాడు రహదారి మరమ్మతుల్లో భాగంగా రేటూరులో శనివారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల విషయంలో పూర్తి నిర్లక్ష్యం వహించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని తెలిపారు. రహదారుల మరమ్మతులు కూడా వేగంగా చేయాలని కాంట్రాక్టర్లకు తెలియజేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటించే విధంగా అధికారుల పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో యుగకీర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి, పార్టీ నాయకులు కొల్లా వీరయ్య చౌదరి, నల్లమోతు పూర్ణచంద్రరావు, నక్కల అగస్టీన్, మామిళ్లపల్లి రాంగోపాల్, గడ్డం శ్రీనివాసరావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే రామాంజనేయులు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలపరిధిలోని రేటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని 8, 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరీక్షించారు. విద్యార్థులకు సాంకేతిక విధానంలో జరుగుతున్న పాఠ్యాంశ బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 84 మంది విద్యార్థులకు 9 మంది ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారని విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపద సృష్టికర్త చంద్రబాబు

పెదనందిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గుంటూరు-పర్చూరు ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతులకు రు.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న మరమ్మతులకు స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో శనివారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రోడ్లకు కనీసం తట్టమట్టి కూడా వేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో రు.6కోట్లతో రహదారులు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతో సంక్షేమం, అభివృద్ధిని జోడెడ్లుగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు దీపావళికి ఉచిత గ్యాస్ పథకాన్ని అందించామన్నారు. ఈ ప్రాంత తాగు, సాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు చాగంటి సత్యహర్ష, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, బత్తిని వేణు, గొల్లపూడి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య గ్రామ అధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య, బండి నాగబాబు, లాస్‌ఏంజెల్స్ టీడీపీ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్, జనసేన మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, నూతి శ్రీనివాసరావు, కాంద్రు ప్రసాద్, షేక్ ఖలీల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులపై ఆరా

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వసతులపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓపీ రోజూ ఎంతమంది రోగులు వస్తున్నారు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా, సిబ్బంది అవసరమేమైనా ఉందా అని వైద్యాధికారి లావణ్యని అడిగారు. వైద్యాధికారితో పాటు స్టాఫ్‌నర్స్ ఒకరు, కావాలని, 108 వాహనం అందుబాటులో ఉంచాలని కోరారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రభుత్వాస్పత్రిలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ప్రజలకు తెలియజేసి కాన్పులు పెరిగేలా చూడాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వాస్పత్రి స్థలాన్ని ఆక్రమించి బిల్డింగ్ నిర్మాణాలు చేపట్టేందుకు పునాదులు వేశారని, దీనిపై స్టే తీసుకురావడంతో పనులు నిలిపివేశారని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ప్రాంతంలో 30పడకల ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

రహదారుల అభివృద్ధి, నాగరికతను తెలియజేస్తాయి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): సక్రమమైన రహదారులే ఆ రాష్ట్రాభివృద్ధి, నాగరికతను తెలియజేస్తాయని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం పొన్నెకల్లులో గుంతలు పూడ్చే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గుంటుపల్లి మధుసూదనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల్లో జగన్మోహన్‌రెడ్డి అన్ని రంగాలను నిర్వీర్యం చేశారన్నారు. జనవరి 15 లోపు గుంతల రోడ్లు పూడ్చటానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం వచ్చే బడ్జెట్‌లో నూతన రోడ్లను వేయటానికి నిధులు కేటాయిస్తారన్నారు. నియోజకవర్గంలోని గుంటూరు-అమరావతి రోడ్డు మరమ్మతులకు రూ.35 లక్షలు, జేకేసీ కళాశాల రోడ్డు నుంచి పొన్నెకల్లు రోడ్డు మరమ్మతులకు రూ.20 లక్షలు, బండారుపల్లి, గరికపాడు, పొన్నెకల్లు రోడ్డు మరమ్మతులకు రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే మేడికొండూరు మండలంలో రూ.55 లక్షలు, ఫిరంగిపురం మండలంకు రూ.13 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రాబోయే 5 సంవత్సరాల్లో నియోజకవర్గంలోని రోడ్లు వెడల్పు చేసే విధంగా అధికారులను ప్రణాళికలు సిద్ధం చేయమని ఆదేశించినట్లు తెలిపారు. పొన్నెకల్లు బ్రిడ్జిని రెండు లైన్లు వేసేలా, తాడికొండ-కంతేరు రోడ్డును రెండు లైన్లు వేసేలా నివేదికలు పంపామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌళికవసతులు కల్పించటానికి కావాల్సిన ప్రణాళికలను ఈనెల 21 లోపు అందజేయాలని ఆయా అధికారులను ఆదేశించినట్లు తెలియజేశారు. ప్రణాళికాబద్ధంగా పనిచేయడానికి నేను సిద్ధంగా ఉన్నానని, ప్రజలు, నాయకులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఆర్ అండ్‌బీ అధికారులు రోడ్ల నిర్వహణ సక్రమంగా ఉందో లేదు వారంలో ఒక రోజు బైక్‌పై ప్రయాణించి పరిశీలించాలన్నారు. అధికారులతో పనిచేయించటానికి ఎమ్మెల్యేగా నేను సిద్ధంగా ఉన్నానని, ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంతేటి బ్రహ్మయ్య, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేతపూడి శేఖర్, గ్రామ అధ్యక్షుడు ఎన్ కాంతారావు, రాజశేఖర్, బి.వెంకటేశ్వరరావు, పాలేటి రమేష్, సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంత రావు, నూతలపాటి రామారావు, పుట్టి రామచంద్రరా వు, తహసీల్దార్ నాసరయ్య, ఎంపీడీవో సమతావాణి, ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ రాజశేఖర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహిత రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

● పెదవడ్లపూడి ఫ్లైఓవర్ వరకు రూ.10 లక్షలతో మరమ్మతులు

● ప్రాధాన్యతా క్రమంలో మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం


రోడ్ల మరమ్మతులను ప్రారంభిస్తున్న నందం అబద్ధయ్య, కూటమి నాయకులు

మంగళగిరి సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజవర్గంలో గుంతల రహిత రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పెదవడ్లపూడి గ్రామంలోని వైగార్డెన్స్ వద్ద కూటమి నేతలు శనివారం గుంతలు పూడ్చే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ పద్మ శాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య మాట్లాడు తూ వచ్చే ఏడాది జనవరి 15 నాటికి రాష్ట్రంలోని అన్ని రహదార్లను గుంతల రహిత రోడ్లుగా మిషన్ మోడ్‌లో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రహదార్లకు మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. మంగళగిరి ఫ్లైఓవర్ వద్ద నుంచి పెదవడ్లపూడి ఫ్లైఓవర్ వరకు సుమారు రూ.పది లక్షల వ్యయంతో రోడ్డు మరమ్మతులు జరుగుతాయన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని రోడ్లను బాగు చేయడంతో పాటు నూతన రహదార్లను నిర్మించడం, రోడ్లకు ఇరు వైపులా కంపచెట్లు తొలగించడం, కల్వర్టుల నిర్మాణం చేపడతామని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో మంగళగిరి-తెనాలి-నారాకోడూరు వరకు 40.05 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డుకు డీపీఆర్‌లు సిద్ధం చేయనున్నట్టు వెల్లడించారు. అలాగే, పెదవడ్లపూడిలో రైల్వే ఫ్లైఓవర్, రేవేంద్రపాడు బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య జనసేన అధ్యక్షుడు నడపన దుర్గారావు, కూటమి నేతలు షేక్ రియాజ్, మాదల రమేష్‌బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, అన్నే చంద్రశేఖర్, మద్దుకూరి రమేష్, యెమినేని సుధాకర్, గుడిమెట్ల మరియదాసు, బోయపాటి రమేష్, జవ్వాది అమ్మయ్య, కఠారి సాంబయ్య, యేళ్ల రవి, జాలాది సందీప్, తదితరులు పాల్గొన్నారు.

చార్జ్ అప్పగించకుంటే ఇంటికే

● జూనియర్ అసిస్టెంట్‌పై డీఎల్‌పీవో సీరియస్

ప్రత్తిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డ్యూటీలో జాయిన్ అయి నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు చార్జ్ ఎందుకు అప్పగించలేదంటూ డీఎల్‌పీవో శ్రీనివాసరావు జూనియర్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పూర్తి చార్జ్ అప్పగించకుంటే ఇంటికి వెళ్లాల్సి వస్తుందంటూ హెచ్చరించారు. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా కోటేశ్వరరావు డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత నెల 5వ తేదీన ప్రత్తిపాడు పంచాయతీకి జూనియర్ అసిస్టెంట్ పోస్టును అధికారులు భర్తీ చేశారు. నెల రోజులు కావస్తున్నా ఇంకా రికార్డులు, బాధ్యతలు అప్పగించకుండా డిప్యుటేషన్‌పై ఉన్న కోటేశ్వరరావు ఇక్కడ విధులు నిర్వర్తిస్తుండంపై డీఎల్‌పీవో శ్రీనివాసరావు మండిపడ్డారు. అలాగే పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. 24 గంటలు మైక్రో ఫిల్టర్‌ను రన్ చేసి రోజు మార్చి రోజు ప్రజలకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే గాకుండా నీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్యం మెరుగు పరచే విధంగా సిబ్బందిని నియమించు కోవాలని అధికారులకు సూచించారు.

మండలంలో గుంతల రహిత రోడ్లకు శ్రీకారం

దుగ్గిరాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంతలమయమైన రోడ్లతో ఇంటి నుంచి రోడ్డుమీదికి వెళ్లాంటే భయపడే రోజులను మరిచిపోయేలా గుంతల రహిత రోడ్ల నిర్మాణానికి మండలంలో శ్రీకారం చుట్టారు. కొన్నేళ్లుగా గుంతల మయమైన రోడ్డులో ఇబ్బంది పడుతున్న రేవేంద్ర పాడు, శృంగారపురం, పెదపాలెం గ్రామస్థులకు, స్థానిక రైతులకు ఊరట లభించనుంది. రేవేంద్రపాడు - పెదపాలెం మధ్య గుంతలమయమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.15లక్షలను మంజూరు చేశారు. రోడ్డు మరమ్మతుల పనులను శనివారం ప్రారంభించారు.

పేదలను ఆదుకునేందుకే సీఎం సహాయనిధి


ఈమని గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను అందిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

దుగ్గిరాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చాలీచాలని సంపాదనతో, వైద్య ఖర్చులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న అనేక మంది పేదలకు చికిత్సకైన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందిస్తూ ప్రభుత్వం ఆదుకుంటోందని టీడీపీ మండల అధ్యక్షురాల కేసంనేని శ్రీఅనిత అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు డబ్బు చెల్లించలేని స్థితిలో ఉన్న మండలంలోని మూడు గ్రామాలకు చెందిన మూడు కుటుంబాలకు నగదు చెక్కులను అందించారు. ఈమని గ్రామానికి చెందిన లోకం శ్రీదేవికి రూ.86,675ల నగదు చెక్కును రేవేంద్రపాడుకు చెందిన కల్లూరు బేబీరాణికి రూ.1,08,600ల నగదు చెక్కును, పెదపాలెంకు చెందిన మల్లెంపాటి ప్రసన్నకు రూ.43,651ల నగదు చెక్కును అందించారు. మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, మండల జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పుతుంబాక సాయి కృష్ణ గ్యారా నిర్మల, జనార్ధన్, కాబోతు దేవదాసు, కేసంనేని వాసు, యడ్ల సాయికృష్ణ, మన్నం అశోక్, కాబోతు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక టీడీపీ నేతలు శనివారం అందజేశారు. అవుకు శ్రీనివాసులకు రూ.31,192, బుస్సా అనితకు రూ.51,309 చొప్పును చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, నేతలు మాదల రమేష్, అన్నే చంద్రశేఖర్, జాలాది సందీప్, మల్లవరపు వెంకట్, మొద్దుకూరి రమేష్, గుడిమెట్ల మరియదాసు, బొర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి రూ.15 వేల కోట్లు ఫండ్‌గా ఇవ్వాలి

● సీపీఎం నేత బాబురావు

తుళ్లూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి ప్రపంచ బ్యాంకు రూ.15 వేల కోట్లు అప్పుగా కాకుండా ఫండ్‌గా ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ బాబురావు అన్నారు. తుళ్లూరులో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, సీఆర్డీఏ అధికారులు రైతులతో ఏర్పాటు చేసిన పర్యావరణ, సామాజిక భద్రత వర్క్‌షాపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అమరావతి రైతుల వార్షిక కౌలు, భూమిలేని పేదలకు ఇచ్చే జీవన భృతి పింఛన్‌ను మరో పది సంవత్సరాలు పొడిగించే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. సీఆర్డీఏ చట్టంలో రాజధాని గ్రామాల ప్రజలకు అమలు చేయాల్సిన ఉచిత విద్య, వైద్యం అందటం లేదన్నారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని బాబురావు కోరారు. చెప్పిన అన్నింటిని పరిగణలోకి తీసుకొని అమలయ్యేలా చూస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు.

పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి

● డీఎల్‌పీవో శ్రీనివాసరావు

ఫటా ఫట్



ప్రత్తిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి పన్నులపైనే ఆధారపడి ఉందని, ఇంటి పన్ను, నీటి పన్నులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి మేజర్ గ్రామ పంచాయతీలలో ప్రత్యేక టీంలను కూడా నియమించి పాత బకాయిల వసూళ్లకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రత్తిపాడు వచ్చిన డీఎల్‌పీలో ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

ప్ర : పాత బకాయిలపై దృష్టి పెట్టారా?

జ : పాత బకాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రెండేళ్లకు పైబడి ఉన్న బకాయిల వసూలును వేగవంతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. మేజర్ పంచాయతీల్లో లక్షల్లో బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి.

ప్ర : రాని బకాయిదారులపై ఏ విధమైన చర్యలైనా తీసుకుంటారా?

జ : ముందుగా రాని బకాయి దారులను కలిసి వారిని వెంటనే బకాయిలు చెల్లించమని కోరుతాం. అలా చెప్పిన గడువు ప్రకారం చెల్లించకపోతే వెంటనే వారి కుళాయి కలెక్షన్‌కు డమ్మీ వేస్తాం. ఆ తరువాత చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తాం.

ప్ర : పారిశుధ్యం మెరుగుపరచడం లేదనే వాదన ప్రజల నుంచి బలంగా వినిపిస్తుంది దానికి మీ సమాధానం?

జ : పన్నుల పైనే పంచాయతీ ఆదాయం ఆధారపడి ఉంది. ముందుగా పన్నులపై దృష్టి పెట్టమని చెప్తున్నాం. అంతే గాకుండా పంచాయతీల బాధ్యతల్లో పారిశుధ్యం ప్రధానమైంది. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం అనేది నిరంతర ప్రక్రియ. ముందుగా ఆ దిశగా అడుగులు వేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తున్నాం.

ప్ర : పారిశుధ్య కార్మికుల నియామకానికి చర్యలు తీసుకుంటున్నారా?

జ : త్వరగా పారిశుధ్య కార్మికుల నియామకాన్ని చేపట్టాలని ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చాం. గతంలో ఇచ్చే వేతనం కాన్నా మరి కొంత ఎక్కువ జీతం కార్మికులకు ఇవ్వాలని కూడా సూచించాం.

ఇన్నోవేషన్ ఐడియాలతో ప్రతిభను చాటుకోవాలి


సర్టిఫికెట్లను అందజేస్తున్న సీఈవోలు

వట్టిచెరుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిని నేటి సాంకేతిక రంగంలో పోటీ పరంగా కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకొని తద్వారా విభిన్న ఇన్నోవేషన్ ఐడియాలతో సొంత కంపెనీలు పెట్టే దిశగా ఎదగాలని కేఎల్‌టీబీ సీఈవో బాబు హరికృష్ణ లంకా మిల్ ట్రానిక్ కంపెనీ సీఈవో లోకేశ్ వంకా విద్యార్థులకు సూచించారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ మూడో సంవత్సరం విద్యార్థులకు మేక్ స్కిల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు 36 గంటల హాథ్థాన్ నిర్వహించారు. శనివారం ఎక్స్‌పో కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేఎల్‌టీబీఏ సీఈవో బాబు హరికృష్ణ లంకా, మిల్ ట్రానిక్ కంపెనీ సీఈవో లోకేశ్ వంకా, మేక్ స్కిల్డ్ సీఈవో టీ మధులు హాజరై విద్యార్థినులు రూపొందించిన ఇన్నోవేటివ్ ఐడియాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ మహిళా ఇంజనీరింగ్ విభాగాల్లో మలినేని విద్యార్థులు వారి ఇన్నోవేటివ్ ప్రాజెక్టులతో కళాశాలను అగ్రస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ శ్రీనివాసకుమార్, ఐటీ హెడ్ సునీత, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేడు ఆస్టర్ రమేష్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం



ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ స్పెషాలిటీ క్లినిక్

గుంటూరు మెడికల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంత పరిధిలోని ప్రజల కోసం తాడేపల్లి సర్వీస్ రోడ్‌లో 13 రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీలతో కూడిన 'ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ స్పెషాలిటీ క్లినిక్' పేరుతో ఔట్ పేషెంట్ విభాగాన్ని నవంబరు మూడో తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నట్లు హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు తెలిపారు. ఈ స్పెషాలిటీ క్లినిక్‌లో ఆధునిక వైద్య పరికరాలతో పాటు పలు రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు. కార్డియాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ, ఎండోక్రైనాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతోపాటు అత్యవసర వైద్య విభాగం, 5జీ అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

పెదవడ్లపూడి శివాలయం నూతన కమిటీ ఏర్పాటు

మంగళగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ధర్మకర్తల మండలి శనివారం ఏర్పాటైంది. నూతన కమిటీ చైర్మన్‌గా మద్దుకూరి రమేష్‌బాబు, సభ్యులుగా భావన వెంకట ప్రసాద్ (బాబు), కొప్పురాజు కోటేశ్వరరావు, సుఖవాసి ధర్మేంద్ర, పట్టపు ఓంలక్ష్మీ, కొప్పాక ఓంకార్, జరపల జమలానాయక్, ప్రత్యేక ఆహ్వానితులుగా పూజారి నాగలింగం వెంకట సుబ్రహ్మణ్యం, జవ్వాది శ్రీనివాసరావులు ప్రమాణస్వీకారం చేశారు. నూతన కమిటీ ప్రతినిధులను ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాదల రమేష్‌బాబు, జవ్వాది కిరణ్‌చంద్, యేళ్ల శివరామయ్య, జవ్వాది రామారావు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, భావన సాంబశివరావు, జనసేన గ్రామ అధ్యక్షుడు నడపన దుర్గారావు, అన్నే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కొల్లిపర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఉప్పాల రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దుగ్గిరాలలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై కొల్లిపర మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్
చెక్కు అందజేత

చేబ్రోలు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య బాధితులను ఆదుకోవటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిధులను మంజూరు చేసుకున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలో శనివారం చేబ్రోలుకు చెందిన జంపని సురేష్‌కు రూ. 3,04,409 సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ అందజేశారు. ముందుగా ప్రార్థన మందిర నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూచిపూడి రవి శేఖర్, షైల వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు నిర్వహించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మగాంధీ శాంతి ఆశ్రమంలో శనివారం పవిత్ర కార్తీక మాసం సందర్భంగా ఎస్‌వీ యోగా సభ్యులు పసుపులేటి మాణిక్యారావు, సావిత్రి దంపతులు, కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ రమణయ్య, పి.వెంకట సాయితేజ, భరత్ స్వామి, హేమంత్‌బాబు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ముగిసిన
సర్వసభ్య సమావేశం

పెదకాకాని, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. శనివారం ఎంపీపీ టి.శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం మొక్కుబడిగా సాగింది. వివిధ శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరుకాలేదు. దీంతో సమావేశం పేలవంగా జరిగింది. సమావేశం ఆద్యంతం అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కుబడిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలాగా చూస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కామినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, తహసీల్దార్ కృష్ణ కాంత్, పలువురు అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాష్ట్ర ప్రతిష్ట పెంచాలి

తెనాలి అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్ర ప్రతిష్ట పెంచాలని విశ్రాంత ఎస్పీ సీహెచ్ చక్రపాణి చెప్పారు. చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తి క్రీడల్లో ఎంతో ముఖ్యమని, విజయం కోసం వ్యూహాత్మకంగా పోరాడాలన్నారు. శారీరక మానసిక వికాసంతోపాటు క్రీడల్లో ప్రావీణ్యం చూపే విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం లభిస్తుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-17 ఏపీ అంతర్ జిల్లా స్థాయి పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు, ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట్రామయ్య, దేవి, కరిముల్లా, రాజారెడ్డి, శివపార్వతి, రవికుమార్, నాగశిరీష, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

ఎస్‌జీఎచ్ ప్రొఫైలింగ్
యాప్‌పై అవగాహన

తెనాలి, మారీసుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం స్లమ్ లెవెల్ ఫెడరేషన్ రిసోర్స్ పర్సన్స్‌కు ఎస్‌జీఎచ్ ప్రొఫైలింగ్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయ అధికారి పద్మజతో కలిసి పాల్గొని యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఏ విధముగా ఫీల్డ్‌లో స్వయం సహాయక సంఘాలు, సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎంఎం విజయకుమారి, సీవోలు, ఆర్‌పీలు, డీఈవోలు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు
తిరుపతమ్మ మృతి


తిరుపతమ్మ (ఫైల్)

తెనాలి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ప్రసాదం తిరుపతమ్మ (107) మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు. అందులో ఒకరు ప్రసాదం భాస్కరరావు గతంలో కొలకలూరు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. మిగిలిన ఇద్దరు వివిధ వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. తిరుపతమ్మ భర్త ముసలయ్య కూడా దాదాపుగా 98 సంవత్సరాలు జీవించి పదేళ్ల క్రితం కాలం చెల్లించారు. తిరుపతమ్మ మృతదేహాన్ని పలువురు మొండిబండ సంఘ సభ్యులు, గ్రామస్తులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం ఆమె అంత్యక్రియలు పూర్తిచేసినట్లు మనుమడు సురేష్ తెలిపారు.

అధ్వాన పారిశుధ్యంతో అవస్థలు


రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన చికెన్ స్టాల్

- అపరిశుభ్ర వాతావరణంలో చేపల మార్కెట్
- నడి రోడ్డుపై మాంసం విక్రయాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పట్టణంలో మాంసం విక్రయదారులు మాసం దుకాణాలను ఇష్టారాజ్యంగా నడి రోడ్డుపై నిర్వహిస్తున్నారు. చేపల, రొయ్యల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడవేస్తున్నారు. పట్టణ ప్రజలు కూరగాయల మార్కెట్‌లోకి ఆ రోడ్డునుంచే వెళ్లాల్సి ఉంది. అక్కడి మాంసం వ్యర్థాల నుంచి వెలువడే దుర్గంధం భరించలేక ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి.

తెనాలి, మారీసుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం మహాత్మగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌ను నిర్మించి అందులో కొన్ని షాపులను చికెన్, మటన్, చేపలు, రొయ్యల అమ్మకందారులకు కేటాయించింది. వారు తమకు కేటాయించిన షాపులలో విక్రయించకుండా రోడ్లపైనే అమ్మకాలు సాగిస్తున్నారు. వాటిని అక్కడే శుభ్రం చేస్తూ వాటి వ్యర్థాలను రోడ్లపైనే వదిలివేస్తున్నారు. వాటిని ఆహారంగా కుక్కలు, పందులు తింటూ భయానక వాతావరణం కలుగజేస్తు ప్రజలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు అధికారుల అండదండలతో రోడ్డును ఆక్రమించుకొని చికెన్‌షాపులను ఏర్పాటుచేసి అమ్మకాలు సాగిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. వ్యర్థాలను కాలువలో పడవేయడంతో నీరు కలుషితమౌతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, వ్యర్థాలు కుళ్లి వ్యాధులు ప్రభలే ప్రమాదమున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలోమాత్రం అమలు కావడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వ్యాపారులు కూరగాయల వ్యర్థాలను కూడా అక్కడే పడవేయడంతో ఆవులు గుంపులుగాచేరి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. అధికారులు స్పందించి మాంసం విక్రయాదారులు వారికి కేటాయించిన షాపులలోనే వ్యాపారాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మాంసం వ్యర్థాలను సేకరించడానికి ప్రత్యేక డ్రమ్ములు ఏర్పాటుచేసి వాటిని డంప్ యార్డుకు తరలించేలా చర్యలు చేపట్టాలని పలు ప్రజా సంఘల నేతలు, వార్డు ప్రజలు కోరుతున్నారు.


రోడ్లపై వేసిన చేపలు, రొయ్యల వ్యర్థాలు

జీబీసీ రోడ్డుకు జాతీయ రహదారిగా ప్రతిపాదన

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వెల్లడి
- మరమ్మతు పనులు ప్రారంభం


నిడుబ్రోలు ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చే పనులు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరుటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి బాపట్ల వరకు ఉన్న ప్రధాన రహదారిని జాతీయ రహదారిగా మార్చి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరనున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. శనివారం నిడుబ్రోలులో రహదారుల మరమ్మతుల పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో రహదారులు అధ్వానంగా మారాయని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం అభివృద్ధి ఆగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 66 కిలో మీటర్ల రహదారుల మరమ్మతులకు రూ. 3.60 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జూపూడి, సీతారామపురం గ్రామాల్లో పనులకు రూ. 80 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. పొన్నూరు పట్టణంలో రూ. 6.10 కోట్లతో రహదారి పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. పొన్నూరు - పాండ్రపాడు రహదారిని రూ. 1.86 కోట్ల వ్యయంతో, పొన్నూరు - చందోలు రోడ్డుని రూ. 3.50 కోట్ల వ్యయంతో పనులు చెప్పట్టాలని కోరినట్లు తెలిపారు. బాపట్ల పొన్నూరు రహదారిని జాతీయ రహదారిగా మార్చి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. చేబ్రోలు వద్ద కొమ్మమూరు కెనల్ పై నిర్మాణంలో ఉన్న వంతెన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు, కూటమి నేతలు ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీకమాస పూజలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హరిహరులకు అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక మాసం. కార్తీకమాసం మొదటి రోజు పరమేశ్వరునికి పలు దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.గంగానమ్మపేటలోని విద్యాపీఠం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో కార్తీకమాస ప్రత్యేక పూజలను చంద్రమౌళీశ్వర స్వామివారికి బాలస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి వివిధరకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలకరించారు.


జస్టిస్ అంబటి లక్ష్మణరావుచిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు

సమాజాభ్యున్నతికి
జస్టిస్ అంబటి కృషి

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్,నవంబరు2 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి జస్టిస్ అంబటి లక్ష్మణరావు ఎనలేని సేవలు అందించారని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో శనివారం జస్టిస్ అంబటి లక్ష్మణరావు సంస్మరణ సభ జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, మండలి బుద్ధ ప్రసాద్ జస్టిస్ అంబటి లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిలుగా మాట్లాడుతూ అంబటి లక్ష్మణరావు వెల్లలూరు గ్రామంలో జన్మించటం పొన్నూరు ప్రాంతానికి గర్వకారణం అన్నారు. అంచెలంచెలుగా ఎదిగి అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అంబటి లక్ష్మణరావు సేవలు అందించారన్నారు. వెల్లలూరు గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయించటమే కాకుండా గ్రామంలో శాంతి నెలకొల్పడటానికి పాటుపడ్డారన్నారు. జనజాగృతి సంస్థ నిర్వాహకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ తనకు అంబటి లక్ష్మణరావు నిరంతరం స్ఫూర్తిని ఇచ్చారని మననం చేసుకున్నారు. మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అంబటి లక్ష్మణరావుతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, మాజీ మంత్రి అంబటి రాంబాబు, కూచిపూడి రవి కిషోర్, అంబటి మురళీకృష్ణ, డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, కోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు

- జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

కొల్లిపర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని అత్తోటలో ప్రకృతి వ్యవసాయంపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అత్తోటలో ప్రకృతి వ్యవసాయం పట్ల దృష్టి పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేసి ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. సమావేశంలో ఆత్మ పీడీ వెంకటేశ్వర్లు, ఏడీఏ సునీత, ఉద్యానవన శాఖాధికారి జానకి, భూమి భారతి వ్యవస్థాపకుడు యర్రు బాపయ్య, ఉద్యానవన శాఖాధికారులు, కేఎల్ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్యార్థులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సహన కుటుంబానికి రూ.10 లక్షలు అందజేత


సహన తల్లికి చెక్కును అందిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే శివకుమార్, రాధిక తదితరులు

తెనాలి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెనాలికి చెందిన సహన(25) బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందగా వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 లక్షలు సాయం ప్రకటించారు. శుక్రవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తెనాలి వచ్చి పరిహారం చెక్కును సహన కుటుంబ సభ్యులకు అందించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పలువురు వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు, (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులో హత్యకు గురైన పేరిపోగు శైలజ కుటుంబ సభ్యులను శనివారం వైసీపీ నాయకులు పరామర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ. 10 లక్షల ఆర్థిక సహాయ చెక్కును అంబటి రాంబాబు చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు.


ఆలయంలో కార్తీకమాస దీపారాధనలు చేస్తున్న మహిళలు

పెదకాకాని శివయ్య సన్నిధిలో
కార్తీకమాసం భక్తుల సందడి

పెదకాకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శివయ్య సన్నిధిలో కార్తీకమాసం భక్తుల సందడి ప్రారంభమైంది. మొదటి రోజు శనివారము దేవస్థానమునకు భక్తులు అధిక సంఖ్యలోవచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు భక్తిశ్రద్ధతో కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక దీపారాధనలు చేశారు. ఆది, సోమవారాల్లో వచ్చే భక్తులకు దాతల సహకారంతో ఉదయం పాలు, మజ్జిగ, తాగునీరు, స్వామి వారి ఉచిత అన్నప్రసాదము ఏర్పాటు చేశారు. ఈ కార్తీకమాస పర్వదినములలో పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి క్షేత్రమునకు విచ్చేసి స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు జరిపించుకోవాల్సిందిగా దేవస్థాన ఉప కమిషనరు, కార్యనిర్వహణాధి కారి గోగినేని లీలాకుమార్ భక్తులకు విజ్ఞప్తి చేశారు.

కార్తీక మాస విశిష్టతను వివరించాలి

- శ్రీవాసవీ ఆలయ కమిటీ చైర్మన్ వెంకట వేణుగోపాలరావు

తెనాలి అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస విశిష్టతను భక్తులందరికీ వివరించాలని శ్రీవాసవీ ఆలయ కమిటీ చైర్మన్ నూకల వెంకటవేణు గోపాలరావు చెప్పారు. బోసురోడ్డులోని ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా చేపట్టిన నిత్యపద్య కుసుమం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. సాహిత్యవేత్త అయినాల మల్లేశ్వరరావు రచించిన గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆలయంలో అన్ని పండుగలను ఎంతో భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్నామన్నారు. సమాజానికి ఉపకరించే కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం అందిస్తున్నామని చెప్పారు. ఈ మాసంలో ప్రతి రోజూ సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన వారిని అభినందించారు. వెంపటి సత్యనారాయణ, బూరెల నరసింహారావు, మద్దాలి శేషాచలం, మాలేపాటి హరిప్రసాద్, ఉప్పల వరదరాజులు, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, కాకరపర్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ వేణు తదితరులు

దళారుల ప్రమేయం లేదు

యార్డు కార్యదర్శి రామసుబ్బారావు

ఫటా ఫట్


రామసుబ్బారావు, యార్డు కార్యదర్శి

తెనాలి క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల పంట అమ్మకాలలో దళారుల ప్రమేయాన్ని సహించేద లేదని తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి రామ సుబ్బారావు తెలిపారు. యార్డును రైతులు ఏ విధంగా వినియోగించుకోవచ్చు అనే విషయాలపై ఆయతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫటాఫట్ ..

ప్ర: యార్డులో దళారుల ప్రమేయం ఉంటుందా?

జ: యార్డులలో దళారులకు అవకాశం లేదు. గోదాములో బస్తా వద్ద నిల్వకు ఒక రూపాయి అద్దె వసూలు చేస్తాము. వారు రానప్పుడు వ్యాపారులకు చదరపు అడుగుకు రూ.5-8 వరకు వసూలు చేస్తాము. ఈ గోదాములలో రైతు ధాన్యం నిల్వ ఉంచితే రైతుబంధు పథకం కింద నిల్వ ఉంచిన దానిని బట్టి రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చు.

ప్ర: యార్డు నుంచి ప్రభుత్వానికి ఏమైనా లాభం వస్తుందా?

జ: యార్డు ద్వారా వివిధ రూపాలలో ప్రభుత్వానికి ఏడాదికి రూ.6.50 కోట్ల ఆదాయం లభిస్తుంది.

ప్ర: ఇక్కడ ఈనాం విధానం అమలులో ఉందా?

జ: ఈనాం పద్ధతిని అమలు జరపడానికి రైతులు, వ్యాపారులు ముందుకు రాకపోవడంతో పూర్తిస్థాయిలో అమలు జరపలేకపోతున్నాము.

ప్ర: యార్డులో ఎన్ని గోదాములు ఉన్నాయి? నిమ్మకాయల దుకాణాలు ఎన్ని?

జ: 21 దుకాణాలు ఉండగా అందులో 17 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఇక్కడి యార్డులో నిల్వ సామర్థ్యం 17 వేల మెట్రిక్ టన్నులు

ప్ర: వ్యాపారుల సరుకు నిల్వ చేయడానికి అవకాశం ఉందా?

జ: రైతులు తమ పంట ఉత్పత్తులు, నిల్వ ఉంచుకోగా, ఖాళీగా గోదాములు ఉంటే వ్యాపారులకు అద్దెకు ఇస్తాం.

ప్ర: గొర్రెల మండీ వలన యార్డుకు ఆదాయం వస్తుందా?

జ: గొర్రెల మండీలో శనివారం 100-150 మాత్రమే అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క గొర్రెకు రూ.50 మాత్రమే అమ్మక రుసుం లభిస్తుంది.

ప్ర: రైతుల ముసుగులో వ్యాపారులు గోడౌన్‌లు పొందుతున్నారని అంటున్నారు?

జ: అలాంటివి మా దృష్టికి తీసుకు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.


మహిళకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా ఉచిత గ్యాస్

పొన్నూరుటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలు నిబంధనలు లేకుండా తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. పొన్నూరు పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో శనివారం దీపం - 2 పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రాయితీ గ్యాస్ సిలిండర్లను అందజేశారు. మహిళల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత గ్యాస్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలు అందాలంటే అడ్డగోలు నిబంధనలు పెట్టి లబ్ధిదారులను పథకాలకు దూరం చేశారన్నారు. సంక్షేమ పథకాలకు, ఇతర పనుల కోసం ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గత ఐదేళ్ల పాలనలో పురపాలక సంఘం గత పాలకులు అందినకాడికి దోచుకున్నారని ధ్వజమెత్తారు. అమృత్-2 పథకం ద్వారా రూ.17 కోట్ల మంజూరైతే ఆ నిధులను ఖర్చు చేయలేదని దుయ్యబట్టారు. ఆ నిధులతో పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తునట్లు వివరించారు. పొన్నూరు పురపాలక సంఘం సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు సమగ్ర నివేదికను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు, మున్సిపల్ కమిషనర్ ముప్పల రమేష్ బాబు, తహశీల్దార్ జియావుల్ హక్, కూటమి నేతలు పాల్గొన్నారు.


డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, అసిస్టెంటు కమీషనర్ లక్ష్మీపతిరావు

డ్రెయిన్‌లలో వ్యర్థాలను వేయరాదు

- పురపాలక సంఘ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు డ్రెయిన్‌లలో వ్యర్థాలు, చెత్తను వేయరాదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శనివారం ఐతానగర్‌లోని 1వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక మున్సిపల్ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి శానిటరీ అధికారులకు డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులకు ఇంటి వద్దనే అందించాలని తెలిపారు. మూడు బుట్టల విధానాన్ని అనుసరించాలని తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరుగా అందించాలన్నారు. పట్టణ సుందరీకరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం 39వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.